గురువారం
01-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 220
పేజీలు : 8, వెల:రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

హాసల్-2ను ప్రయోగించిన ఉ.కొరియా

సియోల్: వ్యూహాత్మక క్రూయిజ్ క్షిపణి 'హాసల్-2'ను డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే) సాయుధ దళాలు పరీక్షించాయి. తూర్పు తీరంలో ఈ ప్రయోగం మంగళవారం జరిగినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) బుధవారం వెల్లడించింది. ఈ మేరకు కొరియన్ పీపుల్స్ ఆర్మీ (కేపీఏ) జనరల్ స్టాఫ్ నివేదించినట్లు తెలిపింది. వ్యూహాత్మక దాడుల సామర్థ్యాన్ని మెరుగు పర్చుకోవడం కోసం, దాడులను ప్రతిఘటించేందుకు కేపీఏ బలాన్ని పరీక్షించేందుకు ఈ పరీక్ష జరిగినట్లు కేసీఎన్ఏ పేర్కొంది. ఈ ప్రయోగం పక్క దేశ భద్రతపై ఎలాంటి ప్రయోగం చూపబోదని వెల్లడించింది.

ఎట్టకేలకు డీఎస్సీ

- అరకొరగా 6,100 పోస్టులతో నిర్వహణ
- 16న చేయూత కింద రూ.5 వేల కోట్లు పంపిణీ
- ఎస్‌సీఈఆర్టీలోకి ఐబీ భాగస్వామ్యం
- అటవీశాఖలో 689 పోస్టుల భర్తీ
- ఇంధనరంగంలో 22వేల కోట్ల పెట్టుబడులు
- మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత అరకొరగా 6,100 పోస్టులతో నిర్వహించేందుకు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. 40 కీలక అంశాలపై సమావేశం చర్చించింది. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం నిరుద్యోగులకు స్వల్ప ఊరటనిచ్చింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే లోగా నియామక ప్రక్రియ ఎంతవరకు పూర్తవుతుందనేది నిరుద్యోగలను ఆందోళనకు గురిచేస్తుంది. డీఎస్సీలో అర్హులైన అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 ఏళ్ల వయోపరిమితి సడలింపు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజుల పాటు, టెట్ 8 రోజులపాటు పరీక్షలు నిర్వహించే ప్రక్రియకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సమావేశం అనంతరం సమాచార, ప్రసారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. మహిళా స్వావలంబనతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి చెప్పారు. అనేకమంది సంఘ సంస్కర్తల ఆలోచనల సమ్మిళతమే జగన్ అని కొనియాడారు. ప్రతిపక్షాలు విమర్శలు చేసినా, చెప్పింది చేసే వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 16వ తేదీన నాల్గవ విడత చేయూత పంపిణీ చేస్తామని, ఇందుకోసం 26,98,931 మంది లబ్ధిదారులకు రూ.5 వేల కోట్ల నిధుల విడుదలకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. చేయూత పథకంపై ప్రతిపక్షాలు చేసేవన్నీ అసత్య ప్రచారాలేనని, ఇప్పటివరకు ఈ పథకం కింద రూ.19,188 కోట్లను నాలుగు విడతల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు అందించామని మంత్రి వెల్లడించారు. 2019 నుంచి విద్యారంగంలో 14,219 పోస్టులు భర్తీ చేశామని, యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంచినట్లు తెలిపారు. అటవీ శాఖలో 689 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. వీటిలో ఫారెస్ట్ రేంజర్

- మిగతా 2 లో

అసెంబ్లీ సమావేశాలు మూడు రోజులే

5న గవర్నర్ ప్రసంగం...అదే రోజు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మూడు రోజులే జరిగే అవకాశాలు కనపడుతున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీన సమావేశాలు ప్రారంభం కానుండగా, అదేరోజు గవర్నర్ ప్రసంగంతో పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. 6, 7 తేదీల్లో బడ్జెట్‌పై చర్చతో పాటు వివిధ సవరణ బిల్లులను సభ ముందు ఉంచే అవకాశముంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలపై చర్చ జరిగింది. వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి శాసనసభ సమావేశాలు కావడంతో ఎన్ని రోజులు నిర్వహించాలి, కొత్తగా ప్రవేశపెట్టే బిల్లులు తదితర అంశాలు

- మిగతా 2 లో

సోరెన్ అరెస్టు

జార్ఖండ్ సీఎంగా సీనియర్ నేత చంపై

రాంచీ:
మోదీ సర్కారు అనుకున్నంత పని చేసింది. ఈడీ, సీబీఐలను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష పార్టీల నేతలను వేటాడుతోంది. అందులో భాగంగా భూకుంభకోణం ఆరోపణలపై జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత సోరెన్‌ను ఈడీ బుధవారం రాత్రి అరెస్టు చేసింది. ఉదయం నుంచి సుదీర్ఘ విచారణ అనంతరం సోరెన్‌ను అరెస్టు చేసినట్లు ప్రకటించింది. అరెస్టు మెమోపై సంతకం చేసేందుకు ముందు సోరెన్ నిరాకరించారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయనను అరెస్టు చేశారు. ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నాయకుడిని అరెస్టు చేయడం ఇదే మొదటిసారి. దీంతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న జేఎంఎం పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకున్నది. జేఎంఎం ఎమ్మెల్యేలు సమావేశమై సోరెన్ మంత్రివర్గంలో రవాణామంత్రిగా పనిచేసిన చంపై సోరెన్‌ను తమ నేతగా ఎన్నుకున్నది. ఇక జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయనను శాసనసభాపక్ష నేతగా పార్టీ బుధవారం ఎన్నుకున్నది. సీఎం హేమంత్ సోరెన్‌ను మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. దీంతో సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు. ఈడీ బృందంతో కలిసి వెళ్లి గవర్నర్‌కు రాజీనామా లేఖ సమర్పించారు. ఈ విషయాన్ని జేఎంఎం ఎంపీ మహువా మాజీ తెలిపారు. చంపై సోరెన్‌ను తమ నాయకుడిగా ఎన్నుకున్నామని జార్ఖండ్ మంత్రి మిథిలేశ్ ఠాకూర్ చెప్పారు. మనీలాండరింగ్ కేసులో ఆయనను మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు విచారించారు. భారీ పోలీసు బందోబస్తు, రాజకీయ హైడ్రామా నడుమ విచారణ సాగింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోసం జేఎంఎం, మిత్రపక్షాలు గవర్నర్‌ను కలిసేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లినట్లు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ తెలిపారు. చంపై సోరెన్ కొత్త సీఎం అవుతారని, ఆయనకు అందరు ఎమ్మెల్యేల మద్దతు ఉందని చెప్పారు. 'కలవడానికి రమ్మని సమయం ఇచ్చారు... వెళ్లిన తర్వాత అవమానించారు. బీజేపీ ఏజెంటుగా రాజ్‌భవన్ పనితీరు ఉంది' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే దీపికా పాండే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫెడరల్ వ్యవస్థకు బీజేపీ తూట్లు పొడిచిందని, బీజేపీ విధానాలు, దాని ఉద్దేశాలపై చర్చించేందుకు వీల్లేదన్నట్లు పరిస్థితులు నెలకొన్నాయని, ఆ పార్టీ చేసే అవినీతి... అవినీతి కాదా అంటూ కాంగ్రెస్ నేత సుబోధ్ కాంత్ సహాయ్ వ్యాఖ్యానించారు.

రాహుల్ గాంధీ కారుపై దాడి

భారత్ జోడో న్యాయ యాత్రలో ఘటన

బెహరంపూర్ (కోల్‌కతా) :
పశ్చిమ బెంగాల్‌లో రాహుల్ గాంధీ యాత్ర లక్ష్యంగా దాడి జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న కారుపై దుండగులు రాళ్లతో దాడి చేశారు. బెంగాల్‌లో భారత్ జోడో న్యాయ యాత్ర కొనసాగుతోంది. బుధవారం ఈ యాత్ర మాల్దా జిల్లాలోకి ప్రవేశించగానే రాహుల్ గాంధీ కారుపై కొందరు గుర్తు తెలియని దుండగులు రాళ్లు విసిరారు. దీంతో ఆయన వాహనం తీవ్రంగా ధ్వంసం అయ్యింది. కారు అద్దాలు కూడా పగిలిపోయాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి తెలిపిన వివరాల ప్రకారం, యాత్ర బుధవారం ఉదయం బీహార్‌లోని కతిహార్ నుంచి రాష్ట్రంలోని మాల్దా జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత ఈ సంఘటన జరిగింది. దాడి ఫలితంగా వాహనం వెనుక అద్దాలు పగిలిపోయాయి. అయితే గాంధీ క్షేమంగా ఉన్నారు. వయనాడ్ ఎంపీ రోడ్డు వెంబడి గుమిగూడిన ఉత్సాహభరితమైన ప్రజలకు చేయి ఊపుతూ అభివాదం చేస్తుండగా ఈ ఘటన జరిగింది. 'బహుశా వెనుక ఉన్న ఎవరైనా గుంపు మధ్య రాయి విసిరి ఉండవచ్చు' అని అధిర్ రంజన్ చౌదరి అన్నారు. 'పోలీసులు దానిని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మార్పులు... చేర్పులు!

వైసీపీ ఐదో జాబితా విడుదల

ముగ్గురు ఎమ్మెల్యే, నలుగురు ఎంపీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం

గురుమూర్తికి తిరిగి తిరుపతి ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల ఐదో జాబితా విడుదలయింది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో జాబితాను విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. మొత్తం ఏడు స్థానాలకు అభ్యర్థులను నియమించారు. ఇందులో ముగ్గురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీ నియోజకవర్గాల అభ్యర్థులున్నారు. ఈ జాబితాలో కొన్ని మార్పులు, చేర్పులున్నాయి. గత జాబితాలో ప్రకటించిన తిరుపతి ఎంపీ, అరకు అసెంబ్లీ స్థానాలను మార్పు చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తిరుపతి ఎంపీగా నియమించడంతో ఆయన అసంతృప్తికి గురై టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. దీంతో ప్రస్తుత తిరుపతి సిట్టింగ్ ఎంపీ మద్దిల గురుమూర్తిని తిరిగి ఎంపీ అభ్యర్థిగా నియమించారు. ఇక అరకు ఎంపీగా ఉన్న గొడ్డేటి మాధవిని అరకు అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌గా నియమించడంతో అక్కడ వైసీపీ కార్యకర్తల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో అరకుకు రేగం మత్స్యం లింగంను నియమించారు. నర్సారావుపేట ఎంపీ ఇన్‌ఛార్జ్‌గా నెల్లూరు టౌన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు పదోన్నతి లభించింది. ఇటీవల నర్సారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పార్టీకి, పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. నర్సారావుపేటలో బీసీ అభ్యర్థిని బరిలో దించాలనే లక్ష్యంతో సీఎం ప్రత్యేకంగా అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌కు కూడా మచిలీపట్నం ఎంపీగా పదోన్నతి లభించింది. కాపు సామాజిక వర్గానికి చెందిన రమేశ్‌ను అక్కడ బరిలో దింపారు. అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రముఖ కేన్సర్ వ్యాధి నిపుణులు

- మిగతా 2 లో

కోనసీమ అల్లర్ల కేసుల ఎత్తివేతకు

హైకోర్టు అభ్యంతరం

ప్రభుత్వ జీవో పక్కనపెట్టాలని ఆదేశం

కోనసీమ జిల్లాలో జరిగిన అల్లర్లపై పోలీసులు నమోదు చేసిన కేసులు ఎత్తివేయడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. 2లో

టార్గెట్ ప్రతిపక్షం

- విపక్ష నేతలపైనే ఈడీ, సీబీఐ గురి
- బీజేపీకి మద్దతే దర్యాప్తు సంస్థల లక్ష్యం
- 2014 నుంచి నాలుగు రెట్లు పెరిగిన ఈడీ కేసులు
- అంతంత మాత్రంగానే పరిష్కారం- నేరారోపణల రుజువు
- పొంతన లేని అధికార ప్రకటనలు-వాస్తవాలు
- 5,906 కేసుల నమోదు
- 25 కేసుల్లోనే శిక్షలు

న్యూఢిల్లీ:
లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండగా దేశంలో ఆపరేషన్ టార్గెట్ అపోజిషన్ మొదలైంది. ప్రతిపక్ష పార్టీల నాయకులే లక్ష్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చర్యలు ఉంటున్నాయి. విపక్ష నాయకులపై అవినీతి ఆరోపణలే బీజేపీకి ప్రచారాస్త్రాలుగా మారుతున్నాయి. ఇందుకు దర్యాప్తు సంస్థలు దోహదమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురి పెట్టింది. చర్యల వేగాన్ని పెంచింది. విపక్షాలను లక్ష్యంగా చేసేందుకు బీజేపీ అస్త్రంగా మారిపోయింది. తెర ముందర ప్రతిపక్ష నేతలపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ తెర వెనుక సొంత అవినీతి బాగోతాన్ని బీజేపీ నడిపిస్తుంది. అయితే చాలా కేసుల్లో నేరారోపణలను రుజువు చేయడంలో ఈడీ విఫలమవుతోంది. 2014 నుంచి ఈడీ కేసులు దాదాపు నాలుగు రెట్లు పెరిగాయి. వీటిలో 95 శాతం కేసులు విపక్ష నేతలపైనే ఉన్నాయి. ప్రతిపక్ష నాయకుల కేసులన్నీ ఈడీ, సీబీఐ

- మిగతా 2 లో

ఇది మొక్కుబడే...

- 6,100 పోస్టులతో సరి
- నిరుద్యోగులకు స్వల్ప ఊరటే
- ఎన్నికల ముందు తాయిలం
- ఏటా 10 వేల పోస్టుల హామీపై జగన్ సర్కార్ దగా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా డీఎస్సీ ప్రకటించింది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశం ఎట్టకేలకు డీఎస్సీ పోస్టుల భర్తీకి ఆమోదముద్ర వేసింది. ఎంతో కాలం నుంచి ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. వారికి మద్దతుగా డీఎస్సీ ఇవ్వాలంటూ యువజన, విద్యార్థి సంఘాలు ఉద్యమాలు నిర్వహించాయి. దీంతో ఎన్నికల ముందు నిరుద్యోగుల కంటినీరు తుడిచేలా డీఎస్సీని ప్రభుత్వం ఇచ్చింది. నిరుద్యోగులకు ఇది స్వల్ప ఊరటగానే మారింది. ఈ పోస్టుల సంఖ్యతో వారంతా నిరుత్సాహం చెందుతున్నారు. వాస్తవంగా రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల నుంచి మే వరకు 62 ఏళ్లు నిండిన ప్రభుత్వ ఉపాధ్యాయుల పదవీ విరమణలు వరుసగా కొనసాగనున్నాయి. వాటి ద్వారా మొత్తం 10 వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలుగా ఏర్పడతాయి. మొత్తంగా 35 వేల వరకు ఉపాధ్యాయ పోస్టుల అవసరం ఉంది. ప్రభుత్వం వాటికి తగిన విధంగా భారీ స్థాయిలో జంబో డీఎస్సీ ఇవ్వకుండా అతి తక్కువ పోస్టులతో భర్తీకి సిద్ధమైంది. అటు ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేనందున, వారిపై పనిఒత్తిడి పెరిగిపోయింది. సీఎం జగన్ నాడు ఎన్నికల సమయంలోను, పాదయాత్రలోను ప్రతి ఏటా 10 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. దానిని వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలోనూ రూపొందించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఏటా పది వేల పోస్టుల చొప్పున నాలుగేళ్లలో 40 వేల పోస్టులు, ఈ చివరి ఏడాది మరో పది వేల పోస్టులతో జంబో డీఎస్సీ

- మిగతా 2 లో

విశాలాంధ్ర
గురువారం 01, ఫిబ్రవరి 2024

కోనసీమ అల్లర్ల కేసుల ఎత్తివేతకు

హైకోర్టు అభ్యంతరం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కోనసీమ జిల్లాలో జరిగిన అల్లర్లపై పోలీసులు నమోదు చేసిన కేసులు ఎత్తివేయడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. కేసులు ఉపసంహరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను పక్కన పెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించింది. కోనసీమ అల్లర్ల నిందితులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం జారీ చేసిస జీవోను సవాల్ చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సాధన సమితి కన్వీనర్ జంగా బాబురావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ 20న జీవో జారీ చేసిందని గుర్తుచేస్తూ, దానిని నిలిపివేయాలని న్యాయస్థానాన్ని కోరారు. పిటిషనర్ తరపున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఏకపక్షంగా కేసులు ఉపసంహరిస్తుందని శ్రవణ్ చెప్పారు. హత్యాయత్నం కేసులను జీవో ద్వారా ఎలా ఉపసంహరిస్తారని శ్రవణ్ ప్రశ్నించారు. వాదనలు విన్న అనంతరం జీవోతో సంబంధం లేకుండా కేసులు ఎత్తివేతపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ప్రతి కేసును క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని పీపీ, ఏపీపీలను ధర్మాసనం ఆదేశించింది. ఏపీలో జిల్లాల పునర్విభజన సందర్భంగా ఏర్పాటైన కోనసీమ జిల్లాకు ఆ తరువాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హింసకు దారి తీసింది. అల్లర్లలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ఆందోళనకారులు తగులబెట్టారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం... పెద్ద ఎత్తున ఆందోళనకారులపై కేసులు నమోదు చేసింది. ఆ తరువాత రాజకీయ కారణాలు చూపి ఆ కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో కేసుల ఎత్తివేతను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది.

రాహుల్ గాంధీ కారుపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోలేదు. పట్టించుకోకపోవడం వల్ల చాలా జరగవచ్చు. ఇది చిన్న సంఘటన. కానీ ఏదో కూడా జరిగి ఉండవచ్చు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మా కారు విండ్‌షీల్డ్ విరిగిపోయింది, కానీ మా యాత్రను అడ్డుకోలేరు. 'ఇండియా' కూటమి తలవంచదు. కూటమిని బలోపేతం చేయడం కూడా తన లక్ష్యమని బెంగాల్ ముఖ్యమంత్రి స్వయంగా చెప్పారని గుర్తు చేస్తున్నాను' అని తెలిపారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా బుధవారం మాల్దాలోని ఇంగ్లీష్ బజార్‌లో తన 'జోనోసంజోగ్ యాత్ర'ను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా రెండు జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. రాహుల్ గాంధీ బుధవారం తన భారత్ జోడో న్యాయ యాత్రను బీహార్‌లోని కతిహార్ జిల్లాలో రోడ్‌షోతో తిరిగి ప్రారంభించారు. మాల్దా జిల్లాలోని దేబీపూర్, రతువా మీదుగా మళ్లీ బెంగాల్‌లోకి ప్రవేశించింది. బెంగాల్‌లో తొలి దశ యాత్ర సోమవారంతో ముగిసింది. ఫిబ్రవరి 1న రాష్ట్రం నుంచి నిష్క్రమించే ముందు ముర్షిదాబాద్‌లోకి ప్రవేశిస్తుంది.

బెంగాల్‌లో కాదు బీహార్‌లో జరిగింది : మమతా బెనర్జీ

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కారును ధ్వంసం చేశారన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ, ఈ ఘటన బీహార్‌లో జరిగిందని, కాంగ్రెస్ చెబుతున్నట్లు బెంగాల్‌లో కాదని అన్నారు. 'రాహుల్ కారుపై రాళ్లతో దాడి చేశారని నాకు చెప్పారు. నేను సంఘటన గురించి ఆరా తీశాను. నాకు అలాంటివి ఇష్టం లేదు. ఇది బెంగాల్‌లో కాకుండా బీహార్‌లోని కతిహార్‌లో జరిగింది. వారు పగిలిన గాజుతో (విండ్‌స్క్రీన్) బెంగాల్‌లోకి ప్రవేశించారు' అని ఆమె తెలిపారు. ఈ ఘటన వెనుక బీజేపీ, నితీశ్ కుమార్‌కు చెందిన జేడీయూ హస్తం ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. 'ఈ సంఘటనను నేను ఖండిస్తున్నాను. బీజేపీ, నితీశ్ ఇటీవల పొత్తు పెట్టుకోవడం వల్ల కోపం ఉండవచ్చు' అని అన్నారు.

ఇమ్రాన్‌కు దెబ్బ మీద దెబ్బ

తోషఖానా కేసులో భార్యతో పాటు మాజీ ప్రధానికి 14 ఏళ్ల జైలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు దెబ్బ మీద దెబ్బ పడింది. తోషాఖానా కేసులో ఇమ్రాన్‌తో పాటు ఆయన భార్యకు బుధవారం 14ఏళ్ల జైలు శిక్ష పడింది. 2022లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుంచి ఆయనకు శిక్ష పడటం ఇది మూడోసారి. ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్యను తోషాఖానా కేసులో దోషులుగా పాకిస్థాన్ కోర్టు తేల్చింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇమ్రాన్‌పై వేటు వేసింది. ఇమ్రాన్ తరపు న్యాయవాది బాబర్ అవాన్ స్పందిస్తూ న్యాయవాద బృందం వచ్చేంత వరకు కూడా ఆగకుండా జడ్జి హడావిడిగా ఇమ్రాన్ ఖాన్‌కు శిక్ష విధించారని చెప్పారు. ఇమ్రాన్ ఖాన్ ప్రాథమిక హక్కులు, మానవ హక్కుల అతిక్రమణ జరిగిందని, తాజా శిక్షలను ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేస్తామని చెప్పారు. తీర్పు ఇచ్చేందుకు జడ్జి చాలా తొందరపాటు కనబర్చారని వ్యాఖ్యానించారు. మంగళవారం సైఫర్ కేసులో ఇమ్రాన్‌కు పదేళ్ల శిక్ష పడిన మరుసటి రోజే ఈ పరిణామం వెనుక కుట్ర కోణం ఉందని రాజకీయ వర్గాలలో గుసగుసలు ఉన్నాయి. ప్రధానిగా తనకు వచ్చిన కానుకలను అమ్ముకున్నట్లు ఇమ్రాన్‌తో పాటు ఆయన భార్యపై ఆరోపణలు ఉన్నాయి. 'ఇది న్యాయ వ్యవస్థ చరిత్రలో దుర్దినం' అని పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) పేర్కొంది. న్యాయ వ్యవస్థ నిర్వీర్యమవుతోందని వ్యాఖ్యానించింది. ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీకి శిక్ష పడినట్లు పీటీఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ ధ్రువీకరించారు. ఇమ్రాన్‌కు శిక్షలను ఒకదాని తర్వాత ఒకటిగా అమలు చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

మార్పులు... చేర్పులు!

డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈయన దివంగత మాజీ మంత్రి (టీడీపీ) సింహాద్రి సత్యనారాయణరావు తనయుడు. అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన డాక్టర్ చంద్రశేఖరరావు చాలా కాలంగా హైదరాబాద్ కేంద్రంగా వైద్యవృత్తిని నిర్వహిస్తూ, అనేక మందికి సేవలందిస్తున్నారు. ఇక పార్టీ తరపున కూడా కొందరికి బాధ్యతలను అప్పగించారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ బాధ్యతలను పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డికి కేటాయించారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం, కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజనల్ కో-ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించారు.

ఐదో జాబితాలోని ఎమ్మెల్యే, ఎంపీ ఇన్‌ఛార్జుల వివరాలివీ

1. అరకు వేలీ (ఎస్టీ) ఎమ్మెల్యే	: రేగం మత్స్యం లింగం
2. కాకినాడ (ఎంపీ)	: చలమలశెట్టి సునీల్
3. మచిలీపట్నం (ఎంపీ)	: సింహాద్రి రమేశ్‌బాబు
4. అవనిగడ్డ (ఎమ్మెల్యే)	: డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు
5. నర్సారావుపేట (ఎంపీ)	: పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్
6. సత్యవేడు (ఎస్సీ) ఎమ్మెల్యే	: నూకతోటి రాజేశ్
7. తిరుపతి (ఎస్సీ) ఎంపీ	: మద్దిల గురుమూర్తి

మలేసియా సుల్తాన్ ఇబ్రహీం ప్రమాణం

కౌలాలంపూర్: మలేసియా 17వ రాజుగా సుల్తాన్ ఇబ్రహీం సుల్తాన్ ఇస్కాందార్ బుధవారం కౌలాలంపూర్‌లోని నేషనల్ ప్యాలెస్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. పెరెక్ రాష్ట్ర పాలకుడు సుల్తాన్ నజ్రీన్ షా డిప్యూటీగా బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఐదేళ్ల వరకు వీరు పదవిలో కొనసాగుతారు. కేబినెట్ మంత్రులతో పాటు ప్రధాని అన్వర్ ఇబ్రహీం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. పహంగ్ రాష్ట్ర పాలకుడు సుల్తాన్ అబ్దుల్లా సుల్తాన్ అహ్మద్‌షా పదవీ కాలం మంగళవారంతో ముగియడంతో ఆయన స్థానంలో సుల్తాన్ ఇబ్రహీం సుల్తాన్ ఇస్కాందార్ బాధ్యతలు చేపట్టారు. మలేసియా రాజ్యాంగబద్ధ రాచరికం కాగా తొమ్మిది మంది సుల్తాన్‌లు/పాలకులు ఐదేళ్లు లెక్కన పరిపాలన సాగిస్తారు.

మెక్సికో అధ్యక్ష రేసులో

కమ్యూనిస్టు నేత మార్కో విన్సియో

మెక్సికో సిటీ: మెక్సికో అధ్యక్షుడి, గవర్నర్ల పదవులకు తమ అభ్యర్థులను మెక్సికో కమ్యూనిస్టు పార్టీ (పీసీఎం) ప్రకటించింది. మెక్సికో అధ్యక్ష పదవికి మార్కో విన్సియో డావిలా జ్యురెజ్ (59)ని తమ అభ్యర్థిగా పీసీఎం ప్రకటించింది. అలాగే మెక్సికో సిటీ గవర్నమెంట్ హెడ్ (సీడీఎంఎక్స్) పదవి కోసం ఏంజిల్ చావెజ్ మంచిల్లా, మొరెలాస్ గవర్నర్‌గా డియాగో టెర్రెస్ పేర్లను ప్రకటించింది. జలిస్కో, యుసాటన్ అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రచార కార్యాచరణ, ప్రజా అనుకూల - కార్మిక అనుకూల విధానాలు, ప్రతిపాదనలనూ తొందరలోనే ప్రకటిస్తామని పేర్కొంది. వారాంతంలో జరిగిన జాతీయ రాజకీయ సదస్సు సందర్భంగా తమ అభ్యర్థులను పీసీఎం నిర్ణయించింది. అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రెడార్ ఆరేళ్ల పదవీ కాలం ముగిసింది. కాగా జూన్‌లో మెక్సికోలో ఎన్నికలు జరగనున్నాయి.

అమెరికా యుద్ధనౌకపై హౌతీల దాడి

సనా: ఎర్ర సముద్రంలో యుద్ధ వాతారణం కొనసాగుతోంది. అమెరికాకు చెందిన యుద్ధ నౌకపై అనేక క్షిపణులతో హౌతీలు బుధవారం దాడి చేశారు. యమనీ సాయుధ దళాలు నేవల్ మిసైళ్లతో అమెరికా డిస్ట్రాయర్ యూఎస్ఎస్ గ్రేవెలీపై దాడి చేశాయని హౌతీలు ప్రకటించారు. మంగళవారం రాత్రి 11.30ల సమయంలో హౌతీల క్షిపణిని యూఎస్ఎస్ గ్రేవెలీ కూల్చేసిందని అమెరికా సెంట్రల్ కమాండ్ తొలుత ఓ ప్రకటన చేసింది. యాంటీ షిప్ క్రూయిజ్ మిసైల్‌తో హౌతీలు దాడి చేశాయని 'సెంట్‌కామ్' తెలిపింది. గతేడాది నవంబరు 19 నుంచి వాణిజ్య నౌకలే లక్ష్యంగా హౌతీల దాడులు కొనసాగుతున్నాయని పెంటగాన్ పేర్కొంది. ఇప్పటివరకు 30కుపైగా దాడులు జరిగినట్లు తెలిపింది. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా పలస్తీనియన్లకు సంఘీభావంగా ఈ దాడులు చేస్తున్నట్లు హౌతీలు ఇప్పటికే స్పష్టంచేసిన విషయం విదితమే.

కృషి, పట్టుదలతో విజయం సాధ్యం

నన్నయ్య వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర-రాజానగరం: పట్టుదల, కృషితో ఏదైనా సాధించవచ్చని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు. తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన 13,14,15 స్నాతకోత్సవాలకు గవర్నరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్సిటీ చాన్సలర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ సంపూర్ణ విద్య అభ్యసించి బాహ్య ప్రపంచంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్య అంటే కుండను నింపడం కాదని, నిప్పు అనేది ఓ మెరుపు అని నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ మాటలను తాను విశ్వసిస్తానని చెప్పారు. జ్ఞానం సంకుచితంగా, మతపరమైన ఆలోచనలవైపు వెళ్లకుండా చూసుకోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ప్రపంచ పౌరులుగా మారడానికి వర్సిటీలు దోహదపడతాయని చెప్పారు. తెలుగు సాహిత్యంలో గొప్ప శాస్త్రీయ కవులలో ఒకరైన నన్నయ పేరును వర్సిటీకి పెట్టడం అభినందనీయమన్నారు. ప్రపంచానికి విశ్వగురువుగా ఎదగాలనే లక్ష్యంతో భారతదేశం ముందుకు వెళుతోందని చెప్పారు. భౌతిక, ఆధ్యాత్మిక విద్యలో మార్గదర్శకత్వం కోసం ప్రపంచం మొత్తం మనవైపు చూసినప్పుడే నిజమైన విజయం సాధించినట్లు అన్నారు. జాతీయ విద్యావిధానం మన ప్రాచీన విద్యావిధానం, విలువలను పునరుద్ధాటించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యాభివృద్ధి, సమాజ సేవతో కూడిన సంపూర్ణ విద్య ప్రవేశపెట్టడంపై సంతోషం వ్యక్తంచేశారు. ప్రతి విద్యార్థి నిస్వార్థమైన సమాజ సేవ చేయాలని కోరారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ దేశానికి, విశ్వవిద్యాలయాలకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా విద్యార్థులు ఉంటారని చెప్పారు. తమ వర్సిటీ అనుబంధ సంస్థలో భాగమైన తాడేపల్లిగూడెంలోని బి.ఫార్మసీ కోర్సుకు 2023లో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) న్యూఢిల్లీ గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఉభయగోదావరి జిల్లాలలో విస్తరించిన తమ విశ్వవిద్యాలయం 392 అనుబంధ కళాశాలలతో లక్షా ఇరవై ఐదు వేల విద్యార్థులతో రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా విరాజిల్లుతోందని చెప్పారు. వర్సిటీ ఏర్పాటుకు కృషి చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు సేవలను గుర్తు చేశారు.

భారతీయ సంఘ సేవకురాలు పద్మశ్రీ సుధామూర్తి తదితరులు ప్రసంగించారు. అనంతరం నన్నయ వర్సిటీలో డిగ్రీలు పూర్తి చేసి ఉన్నత ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, డిగ్రీ పట్టాలను గవర్నర్ అందజేశారు. డాక్టర్ ఎన్.లక్ష్మీపార్వతికి డి. లిటరేచర్, శ్రీ రాజశ్రుతి, గుబ్బల నళిని, జీ.బ్లెస్సీ హెప్సిబా, ముమ్మడి సతీశ్, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు బంగారు పతకాలు అందుకున్నారు. గృహ నిర్మాణసంస్థ రాష్ట్ర చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి, డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు, కె.హేమచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కె.చైతన్య రాజు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, విశ్రాంతి ఉపకులపతి పి.జార్జి విక్టర్, అకడమిక్ సెనేట్, ఫ్యాకల్టీ సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

కాకినాడ జేఎన్టీయూ 10వ స్నాతకోత్సవానికి విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్, జాయింట్ కలెక్టర్ సి.ప్రవీణ్ ఆదిత్య, స్థానిక శాసనసభ్యుడు కురసాల కన్నబాబు, శాసనమండలి సభ్యుడు కర్రీ పద్మశ్రీ, జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ చైతన్య రాజు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లిమిల్లి శేషారెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ జేఎన్టీయూలో జరిగిన స్నాతకోత్సవంలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి 15 సూత్రాల కమిటీ సభ్యుడిగా ఖాలిక్ అలీ ఖాన్ నియామకం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల అమలు కమిటీ రాష్ట్ర సభ్యులుగా ఎన్ఎండీ ఖాలిక్ అలీ ఖాన్‌ను నియమిస్తూ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ కమిటీలో అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ కమ్యూనిటీలోని వెనుకబడిన, బలహీనవర్గాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు సమాన అవకాశాలు ఉండేలా చూసేందుకు, మొత్తం సామాజిక అభివృద్ధి సాధనకు దోహదపడా లనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 15 సూత్రాల రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా అవకాశం రావడం తనకు గర్వంగా ఉందని, రానున్న రోజుల్లో మైనార్టీ వర్గాల కోసం, పథకాల అమలుపై వివిధ శాఖలతో సమీక్షలు, సమావేశాలు నిర్వహించి పథకాల అమలుకు కృషి చేస్తానని అలీఖాన్ తెలిపారు.

ఇది మొక్కుబడే...

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉంది. జగన్ ఇచ్చిన హామీ ప్రకారం చూస్తే, మొత్తంగా 50 వేల పోస్టులను ప్రకటించాలి. ఇచ్చిన హామీకి ప్రస్తుతం ప్రకటించిన 6,100 పోస్టులకు ఏ మాత్రం పొంతన లేకుండా ఉంది. దీని ద్వారా చాలా జిల్లాల్లో సబ్జెక్టు పరంగా ఖాళీలు అతి తక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్ని జిల్లాల్లో అధికంగాను, మరికొన్ని జిల్లాలకు చాలా తక్కువగాను రానున్నాయి. వాటిల్లో రిజర్వుడు పోస్టులు భారీగా తగ్గిపోనున్నాయి. ఈ మాత్రం డీఎస్సీకి నాలుగున్నరేళ్లకు పైగా సాగదీసి ప్రకటించడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది పూర్తిగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారికి అన్యాయమని వాపోతున్నారు.

ఎన్నికల సమయంలో నోటిఫికేషన్

మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఈ అతి తక్కువ సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల ఉపయోగం ఏమిటని నిరుద్యోగ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాలు విడుదలయ్యే సరికి దాదాపు రెండు నెలల సమయం పడుతుంది. నియామకాలు పూర్తి చేసేందుకు మరో నెల రోజులు పడుతుంది. డీఎస్సీ భర్తీ ప్రక్రియకు అన్నీ అనుకూలిస్తే మూడు నెలల సమయం కావాల్సి ఉంది. అయితే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేశామన్న మాట కోసమే... ఇంత హడావుడిగా డీఎస్సీ ఇవ్వడాన్ని నిరుద్యోగులు తప్పుపడుతున్నారు. వాస్తవంగా ప్రభుత్వ ఉద్యోగాలకు జూన్ లేదా డిసెంబరులో నోటిఫికేషన్లు జారీ చేస్తారు. ఆ సమయంలో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. రెండున్నరేళ్లపాటు కరోనాతో ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలకు ఆటంకం ఏర్పడింది. ప్రభుత్వ పాలన చివరి దశలోను, ఎన్నికల ముందు అతి తక్కువ పోస్టులతో డీఎస్సీ ఇవ్వడాన్ని నిరుద్యోగులు జీర్ణించుకోలేక పోతున్నారు. వేలాది పోస్టులతో జంబో డీఎస్సీ వస్తుందని ఆశించిన వారంతా నిరుత్సాహానికి గురయ్యారు. ఈ డీఎస్సీ కోసం చాలా కాలం నుంచి నిరుద్యోగులు ప్రైవేట్ విద్యా సంస్థల్లో శిక్షణ పొందుతూ, ఆర్థికంగా చితికిపోయారు. నాలుగున్నరేళ్ల జాప్యంతో డీఎస్సీ ఇవ్వడం వల్ల చాలా మందికి వయోపరిమితి మించిపోయి డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు అనర్హులుగా మారిపోయారు. దీనికి కేవలం విద్యాశాఖ, ప్రభుత్వ నిర్లక్ష్యమేననే విమర్శలున్నాయి. ఈ డీఎస్సీకి కనీసం జనరల్ అభ్యర్థుల వయోపరిమితి 47 ఏళ్లు ఉండేలా చూడాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

టెట్ నోటిఫికేషన్ ఎప్పుడు?

డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటే ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులంతా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) లో అర్హత సాధించి ఉండాలి. విద్యాహక్కు చట్టం ఆధారంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెట్‌ను నిర్వహించాలి. సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం ఒకసారి మాత్రమే టెట్‌ను నిర్వహించి ఉపాధ్యాయ శిక్షణ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసింది. ప్రస్తుతం చాలా మంది బీఈడీ, డీఎడ్, భాషా పండిట్లు (ఎల్‌పీ) శిక్షణ పూర్తిచేసి ఉండగా, మరికొందరు ఈ ఏడాది చదువుతున్నారు. గతంలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి, టెట్‌లో సరైన స్కోరు లేని వారు, అర్హత సాధించని వారూ వేలాదిగా ఉన్నారు. అలాంటి వారి కోసం మళ్లీ డీఎస్సీ ముందు టెట్ నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ మూడు నెలల వ్యవధితో ఆ టెట్ పరీక్షను ఎప్పుడు నిర్వహిస్తారు?, డీఎస్సీ ఎప్పుడు నిర్వహిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో టెట్ కమ్ టీఆర్టీ పరీక్షను కలిపి ప్రభుత్వం నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. అదే జరిగితే గతంలో టెట్‌లో అత్యధికంగా స్కోరు చేసిన వారికి అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టెట్, డీఎస్సీ పరీక్షలను వేర్వేరుగా వేగవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ప్రస్తుతమున్న డీఎస్సీ పోస్టుల సంఖ్యను 6,100 నుంచి 20 వేలకు పెంచాలని, జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, ప్రతి సబ్జెక్టులోనూ సమానంగా పోస్టులు ఉండేలా చూడాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీలోకి రావెల కిశోర్, చుక్కా విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, ఐఆర్ఎస్ మాజీ అధికారి చుక్కా విల్సన్ బాబు బుధవారం వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం జగన్‌ను కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. ఐఆర్ఎస్ మాజీ అధికారి అయిన రావెల కిశోర్‌బాబు 2014లో గుంటూరు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీచేసి గెలిచారు. టీడీపీ హయాంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం 2018లో టీడీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు జగన్ కృషి: రావెల కిశోర్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రావెల కిశోర్‌బాబు అన్నారు. వైసీపీలో చేరిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల రాజకీయ కలను జగన్ సాకారం చేస్తున్నారన్నారు. రెండు లక్షల కోట్ల రూపాయలను పేదల ఖాతాలో జమ చేయడం చరిత్రకమన్నారు. డ్వాక్రా మహిళలను గత పాలకులు ఓటు బ్యాంకుగా చూశారని, జగన్ మాత్రం వారికి రుణాలను విడతలవారీగా మాఫీ చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా జగన్ చూస్తున్నారన్నారు. పేదలకు చేస్తున్న సేవలకు ఆకర్షితుడినై వైసీపీలో చేరానని చెప్పారు. జగన్ ఏం చెబితే అది చేసేందుకు సిద్ధంగా ఉన్నానని రావెల కిశోర్‌బాబు అన్నారు

ఎట్టకేలకు డీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

ఆఫీసర్లు సహా వివిధ పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. ఎస్‌సీఈఆర్టీలోకి ఐబీ భాగస్వామ్యానికి కేబినేట్ ఆమోదం తెలిపిందని, దీనివల్ల ఇప్పటివరకు శ్రీమంతుల పిల్లలు మాత్రమే చదివే ఐబీని ఏపీ విద్యావ్యవస్థలోకి తీసుకురానున్నామని చెప్పారు. ఐబీ విద్యతో మన విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోనున్నట్లు చెప్పారు. ఇంధన రంగంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడుల ప్రాతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది .ఏపీ డిస్కమ్స్‌కు రూ.1500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారంటీకి, మారుమూల గిరిజన ప్రాంతాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూపు(పీవీజీటీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో ఏపీ డిస్కమ్స్ రూపొందించిన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో రెండు విడతల్లో 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ యూనిట్లను రూ.1153 కోట్లతో ఏర్పాటు చేయాలని, చట్టసభలకు కొత్తగా ఎన్నికైన సభ్యులకు, అధికార్లకు, చట్టసభల సిబ్బందికి, ఇతర ప్రభుత్వ అధికార్లకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు అసెంబ్లీ ప్రాంగణంలో ఏపీ లెజిస్లేచర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెజిస్లేటివ్ స్టడీస్ అండ్ ట్రైనింగ్ సంస్థ ఏర్పాటు చేయడంతో పాటు డైరెక్టర్(నాన్ కేడర్) పోస్టుతో పాటు లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో 27 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు పరిధిలో 5376 నిర్వాసిత కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇస్తున్న ఇళ్ల పట్టాలు, ఇళ్లకు సంబంధించిన రూ.52 కోట్ల స్టాంప్ డ్యూటీ, రూ.8 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీల మినహాయింపు, ప్రముఖ చెస్ క్రీడాకారిణి కుమారి కోలగట్ల అలనా మీనాక్షికి విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో 500 గజాలు, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనికి 1000 చదరపు గజాల నివాసస్థలం, సత్యవేడు మండలం మల్లవారిపాలెంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐఐటీ), శ్రీసిటీ ఏర్పాటుకు అవసరమైన 42.23 ఎకరాల భూమి కేటాయింపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రుల పనితీరు, త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికలకు నిర్వహించే ప్రచారంలో ఎలా ముందుండాలి, ప్రతిపక్ష నేతల విమర్శలను ఎక్కడికక్కడ ఎలా తిప్పికొట్టాలనే అంశాలపై మంత్రులకు సీఎం జగన్ క్లాస్ పీకినట్లు తెల్సింది.

అసెంబ్లీ సమావేశాలు మూడు రోజులే

(మొదటిపేజీ తరువాయి)

చర్చకొచ్చాయి. సహజంగా బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా తొలిరోజు గవర్నర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత సభ వాయిదా పడుతుంది. అనంతరం స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి, సభలో ప్రవేశపెట్టే బిల్లులు, చర్చించే అంశాలను నిర్ణయిస్తారు. అటువంటిది తొలిరోజే గవర్నర్ ఉపన్యాసం తదుపరి ఒకరోజు వృథా కాకుండా వెంటనే ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టి సభను వాయిదా వేస్తే... ఆ తర్వాత రెండు రోజులు బడ్జెట్‌పై చర్చ పెట్టి సమావేశాలు ముగిస్తే ఎలా ఉంటుందనేది మంత్రివర్గంలో చర్చకొచ్చినట్లు తెలిసింది.

టార్గెట్ ప్రతిపక్షం

(మొదటిపేజీ తరువాయి)

విచారణలోనే ఉన్నాయి. తమది అధిక శిక్షల రేటు (కన్విక్షన్ రేట్) అని ఈడీ చెప్పుకుంటుంది కానీ వాస్తవాలకు, అధికారిక గణాంకాలకు పొంతన లేదని 'ది వైర్' గతంలో నివేదించింది. 2023, మార్చి వరకు మొత్తం 5,906 కేసులను ఈడీ నమోదు చేసింది. వీటిలో 1,142 కేసులలో చార్జిషీట్లు దాఖలయ్యాయి... విచారణ ముగించింది. మొత్తం కేసుల్లో 0.42శాతం అంటే 25 కేసులను మాత్రమే పరిష్కరించింది. ఇందులో 24 కేసుల్లో శిక్షలు పడ్డాయి. దీంతో శిక్షల రేటు 96 శాతమని ఈడీ గొప్పలు పోతోంది.

దేశంలో విభజన రాజకీయాలు తార స్థాయికి చేరిన సమయంలో దర్యాప్తు సంస్థలు దుర్వినియోగమవుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలకు ప్రాధాన్యత లభించింది. ఈ విమర్శలతో వచ్చే సందేహాలను నివృత్తి చేయడం మానేసి... సీబీఐ లేక ఈడీ కంటే ముందుగానే అనేక కేసుల వివరాలను బీజేపీ బహిర్గతం చేస్తుండటంతో చెప్పేయడంతో ప్రతిపక్ష నేతల ఆరోపణలకు బలం చేకూరింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతిపక్ష నేతలపై లక్షిత దాడులతో ప్రజలకు వారి ఆరోపణలపై నమ్మకం కలుగకమానదు.

త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. కాబట్టి ఈడీ దాడులు మరింతగా పుంజుకునే అవకాశముంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకునేందుకు బీజేపీ ఇప్పటికే దూకుడు పెంచింది. ఇదే క్రమంలో జార్ఖండ్ ముక్తి మోర్చా నాయకుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఈడీ అస్త్రాన్ని ప్రయోగించింది. సోమవారం ఢిల్లీ నివాసంలో, బుధవారం రాంచీలోని అధికారిక నివాసంలో ఈడీ సోదాలు జరిగాయి. దీంతో బినామీ పేరిట ఆస్తులున్నాయని సోరెన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ నివాసం నుంచి రూ.36లక్షల నగదు, బీఎండబ్ల్యూ కారును అధికారులు సీజ్ చేశారు. ఇదే విషయమై ఎస్టీ,ఎస్సీ అట్రాసిటీ కేసును సోరెన్ నమోదు చేశారు. అయితే కేంద్ర దర్యాప్తు బృందం లక్ష్యంగా మారిన నాల్గో విపక్ష సీఎంగా సోరెన్ నిలిచారు.

ఇంతకుముందు చత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బాఘెల్, ఆయన సహచరులపై ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో ఈడీ విచారణ సాగింది. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు సీఎం పేరును ఈడీ తెరపైకి తెచ్చింది. దీంతో సీఎం అవినీతిపరుడంటూ ప్రచారం చేసేందుకు బీజేపీకి అవకాశం లభించింది. అలాగే రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన తనయుడు తేజస్వీ యాదవ్‌పైనా ఉద్యోగానికి బుదలు భూమి కేసు విచారణ కొనసాగుతోంది. ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మద్యం కేసులో అనేక నోటీసులను ఈడీ ఇప్పటికే జారీచేసింది. ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఎంపీ సంజయ్ సింగ్ ముందే అరెస్టు కాగా మంత్రి సత్యేంద్ర జైన్ రెండేళ్లుగా జైల్లో ఉన్నారు. ఈడీ విచారణకు హాజరుకాని పక్షంలో కేజ్రీవాల్ అరెస్టు కావచ్చన్న ఊహాగానాలు ఉన్నాయి. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు తనను అరెస్టు చేయించే కుట్ర జరుగుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.

తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ షాజహాన్ ఇంటిని సోదా చేసేందుకు వచ్చిన ఈడీ అధికారులను ఆయన మద్దతుదారులు అడ్డుకోవడం ఈమధ్యనే జరిగింది. ఈ వ్యవహారానికి బీజేపీ మతం రంగు పులిమింది. ముస్లింలను దుర్భాషలాడింది. మైనారిటీ వర్గాన్ని మెప్పించేందుకు టీఎంసీ యత్నిస్తోందని ఆరోపించింది. ప్రజా పంపిణీ వ్యవస్థలో కుంభకోణంపై విచారణలో భాగంగా ఈనెల 24న షాజహాన్‌కు చెందిన నార్త్ 24 పరగణాల జిల్లాలోని నివాసాన్ని ఈడీ అధికారులు తనిఖీచేశారు. ఇదే కేసులో టీఎంసీ మంత్రి జ్యోతి ప్రియా మల్లిక్ 2023 అక్టోబరులో అరెస్టయ్యారు. ఇలా అనేక మంది విపక్ష నేతలు దర్యాప్తు సంస్థల ఉచ్చులో చిక్కుకొని ఉన్నారు.

జల్ జీవన్ మిషన్ కుంభకోణంలో ప్రమేయమున్నట్లు రాజస్థాన్‌లో కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మహేశ్ జోషిపై ఆరోపణలు ఉన్నాయి. హరియాణా, హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ నేతలు కొందరు హరియాణా పట్టణాభివృద్ధి యంత్రాంగం కుంభకోణంలో నిందితులుగా ఉన్నారు.దక్షిణాది రాష్ట్రాల ప్రతిపక్ష నేతలు కూడా వేర్వేరు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

రాముడి పేరుతో బీజేపీ రాజకీయం

7-8 తేదీల్లో దిల్లీలో హోదా దీక్షలు: ముప్పాళ్ల

విశాలాంధ్ర-భీమవరం: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఈ నెల 7, 8, 9 తేదీల్లో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద హోదా సాధన సమితి అధ్వర్యంలో జరిగే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి సమావేశం బుధవారం జరిగింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రంగారావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన బీజేపీని గద్దె దించడానికి సమయం ఆసన్నమైందన్నారు. అలవికాని హామీలిచ్చి మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆయన విరుచుకు పడ్డారు. రాముడిని అడ్డం పెట్టుకొని మూడోసారి గద్దె నెక్కడానికి బీజేపీ పన్నుతున్న కుట్రలను ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయోధ్య రాముడిని తాకట్టు పెట్టి ఓట్ల కుతంత్రం జరుపుతోందని మండిపడ్డారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే రాముడి అక్షింతలను దేశమంతటా పంచిందని, బీజేపీ కుట్రలతో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని ముప్పాళ్ల చెప్పారు. మొదటిసారి కాంగ్రెస్ వైఫల్యాలు, కుంభకోణాలను బూచిగా చూపి గద్దెనెక్కిన బీజేపీ...ఐదేళ్ల క్రితం పుల్వామా, సర్జికల్ దాడులు, చైనాను అడ్డుపెట్టుకొని గెలుపొందిందని, ఇప్పుడు రాముడిని వాడు కుంటుందని నిందించారు. జగన్ పాలనలో దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, జగన్ ప్రజా కంటక పాలనకు చరమగీతం పాడాలని ముప్పాళ్ల విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా సీపీఐ పోరాడుతోందని, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళదామని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, వ్యవసాయం సంక్షోభంలో పడిందని, ఆక్వా రంగం కుదేలైందని, దీనికి జగన్ సర్కారు బాధ్యత వహించాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను సీఎం జగన్ అమలు చేయాలన్నారు. సామాజిక పింఛన్లు ఆరు వేలకు పెంచాలని, వికలాంగులకు ఏడు వేలివ్వాలని, అర్హులయిన భార్యాభర్తలు ఇద్దరికీ సామాజిక పింఛన్లు అందచేయాలని, అరవై ఏళ్లు దాటిన వృద్ధులకు ప్రత్యేకంగా ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర పరిణామాలను నిశితంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజల తరపున పోరాడాలన్నారు. జనంలోకి పార్టీని తీసుకెళ్లాలని, పార్టీ శాఖలు బలోపేతం కావడానికి కృషి చేయాలని కోనాల కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, కళింగ లక్ష్మణరావు, జిల్లా సమితి సభ్యులు నామాన వెంకటేశ్వరరావు, సనపల శ్రీనివాస్, వైవీ ఆనంద్, కోన గొల్లయ్య, కర్రి సూరి బాబు, మండల నాగేశ్వరరావు, జయకృష్ణ, నెక్కంటి క్రాంతి కుమార్, ఆరేటి మృత్యుంజయుడు తదితరులు పాల్గొన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలు

మంత్రి బొత్సకు ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ 2003 బ్యాచ్‌కు చెందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎస్టీయూ వినతిపత్రం అందజేసింది. ఈ మేరకు బుధవారం విజయవాడలోని మంత్రి బొత్స క్యాంపు కార్యాలయంలో ఆయనను ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న కలసి సమస్యలు వివరించారు. 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2008 డీఎస్సీ ఎంపిక విధానంలో జరిగిన పొరపాట్ల వల్ల నష్టపోయిన అభ్యర్థులను 2021 జులైలో ఎంటీఎస్ విధానం ద్వారా ఒప్పంద ప్రాతిపదికన ఎస్జీటీలుగా నియమించారని, వారిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. ఆ తీర్పు ఆధారంగా 2008 డీఎస్సీ ఉపాధ్యాయులను శాశ్వత ప్రాతిపదికన నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ ఉత్తర్వులు అమలు జరిగేలోగా తాత్కాలికంగా 100 శాతం గ్రాస్ పే అమలయ్యేలా చూడాలన్నారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అందులో చాలామంది వెంటనే పదవీ విరమణ చేశారని, వారికి పెంచిన 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సును అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం కానందున 679 ఎంఈవో పోస్టులు సృష్టించి, వాటిని ఎంఈఓ 2 పేరుతో ప్రభుత్వం నియమించిందని గుర్తుచేశారు. ఎంఈవో1, ఎంఈవో 2 పేరుతో కాకుండా ఎంఈవో(ప్రభుత్వ),ఎంఈవో(పీఆర్)గా మార్చాలని కోరారు. అందులో సీనియర్ ఎంఈవోకు డీడీఓ అధికారాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనే లక్ష్యంగా

7, 8, 9 తేదీల్లో దిల్లీలో పోరు

చలసాని శ్రీనివాస్, లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలే లక్ష్యంగా పోరాడుతున్నట్లు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శ్రీకాకుళంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ముమ్మడి ఆస్తుల పంపకాలలో రాష్ట్రానికి రావలసిన వాటా అప్పగించాలని కోరారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక గనులు కేటాయించాలని, నిధులు సమకూర్చాలని, అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కేంద్ర విద్యా సంస్థలు నెలకొల్పి నిధులు సమకూర్చాలన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ ఏకమై ఆంధ్రుల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో దిల్లీ సాక్షిగా పోరాటాన్ని సాగించబోతున్నట్లు చలసాని శ్రీనివాస్, జేడీ లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఈ సమావేశంలో సాధన సమితి జిల్లా అధ్యక్షుడు జి.నర్సునాయుడు, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చాపర వెంకటరమణ, డి గోవిందరావు సీపీఎం నేతలు సింహాచలం, అమ్మన్ నాయుడు, విశ్రాంతి డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, బీసీ న్యాయవాదుల సంఘ ప్రతినిధులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, కిల్లి మార్కండేయులు, విశ్రాంత జెడ్పీసీఈవో సురంగి మోహనరావు, ఎస్ఎన్ రావు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమాలు

- 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి
- ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సీ2జీ 50 శాతం ప్రకారం మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా ఒక పర్యాయం రైతులకు రుణ మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతన చట్టం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించి 200 రోజులు పని దినాలు పెంచాలని, వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్య వేదిక సంయుక్తంగా పిలుపునిచ్చాయి. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపును జయప్రదం చేయడానికి బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అధ్యక్షతన కార్మిక, కర్షక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. బంద్, సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నాయకులు కోరారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో జి.ఓబులేసు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికారం పొందేందుకు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి హిందుత్వ వాదనను ప్రధాని మోదీ తెరమీదకు తీసుకువస్తున్నారని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మరింత ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేక హోదా నిరాకరించిందని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదని, జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రైల్వే జోన్‌కు ఎగనామం పెట్టిందని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిందని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, గతంలో మాదిరిగానే ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం-2022ను వెనక్కి తీసుకోవాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా మోసగిస్తోందని, వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నింటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోందని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని కోరారు. ఏఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రిరెడ్డి వెంకటరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సుబ్బరావమ్మ, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ చుండూరు రంగారావు, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.బాలు మాట్లాడారు. తొలుత అనకాపల్లికి చెందిన రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ ఎ.బాలకృష్ణ మృతికి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు సంతాప తీర్మానం పెట్టారు. బాలకృష్ణ చిత్రపటానికి కృష్ణయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (బీకేఎంయూ) సీహెచ్ కోటేశ్వర రావు, జాగృతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు పోలారి, రవిచంద్ర, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు యు.వీరబాబు, విశ్రాంత ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు, గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జొన్న శివశంకర్, కె.అజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోటా కల్యాణ్ పాల్గొన్నారు.

మెగా మోసాన్ని నిరుద్యోగులు క్షమించరు

సీఎం జగన్‌కు విద్యార్థి, యువజన సంఘాల హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి మోసం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నిరుద్యోగులు క్షమించరని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ పేర్కొన్నాయి. అప్రంటిస్ విధానం తెచ్చి నిరుద్యోగులను నిలువునా ముంచేశారని వేర్వేరు ప్రకటనలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయి కుమార్ దుయ్యబట్టారు. మెగా డీఎస్సీ పేరిట మోసం చేసిన ప్రభుత్వాన్ని నిరుద్యోగులు కూల్చుతారని హెచ్చరించారు. మెగా డీఎస్సీ లేకపోతే మెగా ఓటమి తప్పదని తేల్చిచెప్పారు. నాణ్యమైన విద్యా ప్రతి ఒక్కరికి అందాలని చెప్తున్న జగన్ విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయ ఉద్యోగాలే భర్తీ చేయలేదన్నారు. నాడు-నేడు పేరుతో కోట్లు ఖర్చు చేస్తున్నామంటున్నారు కానీ గోడలకు రంగులు తప్ప మరేమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. టీచర్లే లేకపోతే ఎంత ఖర్చు చేసినా ఫలితం ఏముంటుందని ప్రశ్నించారు. 25వేల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని నాడు చెప్పారుగానీ నేటికీ అందుకు చర్యలు లేవని విమర్శించారు. చావు కబురు చల్లగా చెప్పినట్లు 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం మోసం కాక మరేమిటని నిలదీశారు. అప్రెంటిస్ విధానం రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తనిఖీ పేరిట దోపిడీ

సీపీఎం నేతల విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు, వారి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున దోపిడీకి సిద్ధమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల పేరుతో పెద్ద, చిన్నవాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్‌కు ఆహ్వానించిందని, బిడ్డింగులను ఎక్కువ చెల్లించే వారికి కేటాయిస్తామని నిబంధన పెట్టిందన్నారు. అంటే ఆ భారాన్ని వాహన యజమానుల నుంచి వసూలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలుకుబడి కలిగిన కొంతమంది పెద్దలు, వారి కుటుంబ సభ్యులు బినామీల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ ఏడాది అక్టోబరు నాటికి బిడ్డింగ్ పూర్తి చేయాలని కేంద్రం ఆదేశిస్తే...రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒకడుగు ముందుకేసి ఇప్పుడే టెస్టింగ్ సెంటర్లకు జాతీయ రహదారుల పక్కన స్థలాలు కేటాయించే పనిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందే వాహన యజమానుల నుంచి పెద్దఎత్తున దండుకునేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్రం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, వాస్తవంగా రోడ్లు సరిగా లేవని, డివైడర్లు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయడం లేదని, అత్యంత వేగవంతమైన వాహనాలు నడిపేందుకు వీలుగా రోడ్లు లేవని, డ్రైవర్లకు తగిన శిక్షణ కూడా లేదని, అందువల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కాగా, ఫిబ్రవరి 1 నుంచి పదోతేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా సీపీఎం ప్రజానిధి క్యాంపెయిన్ నిర్వహిస్తోందని శ్రీనివాసరావు, బాబూరావు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఉద్యమాల నిర్వహణ కోసం ప్రజల నుంచే డబ్బులు అడుగుతున్నామని వివరించారు. ప్రధాన రాజకీయ పార్టీలకు కార్పొరేట్ కంపెనీలు నిధులు సమకూరుస్తున్నాయని విమర్శించారు. సెర్ప్, మెప్మా, మహిళా సాధికారత సంస్థల్లో పనిచేస్తున్న వీవోఏ, ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఎం జగన్‌కు సీపీఎం నేతలు లేఖ రాశారు.

సమగ్ర యువజన విధానం అమలు

చట్టసభల్లో యువతకు అధిక సీట్లు: లెనిన్ బాబు డిమాండ్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందని, ఈ సమస్య పరిష్కారానికి అధికార-విపక్షాలు పూనుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు అన్నారు. సమగ్ర యువజన విధానాన్ని రూపొందించాలని, ఉద్యోగాలు ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి కల్పించాలని, చట్టసభల్లో యువతకు అధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో లెనిన్‌బాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల క్రమంలో అధిక స్థానాలిచ్చి యువతను ప్రోత్సహించాలని రాజకీయ పార్టీలను కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల మూత, కొత్త పరిశ్రమలు లేక నిరుద్యోగం 16శాతం మేర పెరిగిందని తెలిపారు. ఇచ్చిన హామీల అమలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, ఆచరణ సాధ్య హామీలే ఎన్నికలప్పుడు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ అధ్వర్యంలో యూత్ మేనిఫెస్టో తయారు చేసి అన్ని పార్టీలకు అందిస్తామని తెలిపారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక నిరుద్యోగుల వయస్సు మించిపోతోందన్నారు. ప్రభుత్వ శాఖలో ఖాళీ ఉద్యోగాలపై ప్రతి సంవత్సరం శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు వాటని భర్తీకిగాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇయర్ క్యాలెండర్ పాటించాలని కోరారు. నిరుద్యోగులకు నెలకు రూ.10వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి కోసం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్, వసతి, మెటీరియల్ అందించాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల పోస్టులు భర్తీ చేయకుండా కేవలం 6వేల పోస్టులు భర్తీ చేస్తామనడం సిగ్గుచేటన్నారు. ఏడేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు లేవని లెనిన్‌బాబు విమర్శించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు ఆనంద్ కుమార్, సంతోశ్ కుమార్, నగర కార్యదర్శి మోహన్ కృష్ణ, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి ధనుంజయ, నాయకులు శ్రీకాంత్, షకీల్, అశోక్ పాల్గొన్నారు.

శిరోముండనం కేసు విచారణ పునఃప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న తోట త్రిమూర్తులు 2006లో జరిగిన ఉపఎన్నికల్లో తనకు ఓటు వేయలేదన్న కక్షతో ఐదుగురు దళిత యువకులను కొట్టి...ఇద్దరికి శిరోముండనం చేసిన కేసు విచారణ బుధవారం తిరిగి ప్రారంభమైంది. బాధితుల కులంపై నిందితుడు అభ్యంతరం చెప్పడంతో 2019లో ఈ కేసు విచారణపై హైకోర్టు స్టే ఇచ్చింది. దీనిపై 2021లో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. బాధితులను ఎస్సీలుగానే గుర్తించి కేసు విచారణ కొనసాగించాలని హైకోర్టు గత డిసెంబరులో ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విశాఖ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధానికి సంబంధించిన ప్రత్యేక కోర్టు విచారణ ప్రారంభించింది. వెంకటాయపాలెం శిరోముండనం బాధితులు కోటి చినరాజు, దడాల వెంకటరత్నం కోర్టుకు హాజరై తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధితుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సత్యనారాయణమూర్తి వాదనలు వినిపించారు. న్యాయమూర్తి డి.శ్రీధర్ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేశారు. స్టేను అడ్డుపెట్టుకొని కక్షసాధింపుతో బాధితుల పిల్లలకు విద్యా దీవెన వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిలిపి వేసిందని, హైకోర్టు ఉత్తర్వులతో వాటిని పునరుద్ధరించాలని విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు.

జగన్ పాలనలో అభివృద్ధి ఏదీ?

- వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా...
- ఈశ్వరయ్య ప్రశ్న

విశాలాంధ్ర- రాయచోటి: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యాల యంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టి, జిల్లాలను విభజించిన తర్వాత అన్నమయ్య జిల్లాను ఏమి అభివృద్ధి చేశారో అధికార పార్టీ నాయకులు చెప్పాలని, అభివృద్ధి చేసి ఉంటే బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. కడప-బెంగళూరు రైల్వే లైను కూడా అవసరం లేదని రాసిచ్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. జిల్లా ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుకు అయినా ఒక్క పైసా నిధులు కేటాయించారా?, వెలిగల్లు ప్రాజెక్టు, ఝురికోన ప్రాజెక్టుల కుడి, ఎడమ కాలువలను పూర్తి చేశారా అని నిలదీశారు. హంద్రి-నీవా కాలువకు నిధులు ఇవ్వలేదని తెలిపారు. మదనపల్లె ప్రజల దాహార్తి తీర్చే సమ్మర్ స్టోరేజ్‌కు నిధులు ఇచ్చి పూర్తి చేయ లేదన్నారు. సుండుపల్లి, వీరబల్లి ప్రాంతాల దాహార్తి తీర్చే రోళ్లమడుగు ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయి ఆ వరద ఉధృతిలో 32 మంది ప్రాణాలు పోవ డంతో పాటు మూగ జీవాల మృతికి వైసీపీ నాయకులే కారణమన్నారు. జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదని, మంగంపేట బైరటీస్‌లో అవినీతి తారస్థాయికి చేరిందని, దానిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో భూములన్నీ సస్పెన్షన్‌కు గురైన జిల్లా కలెక్టర్ గిరీశా కనుసన్నల్లోనే దోచుకున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధిపైనే అజెండా ఉండే విధంగా పోరాటం చేయాలని ఈశ్వరయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ చేసే పోరాటాలకు ప్రజలు బాసటగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు టి.రాధాకృష్ణ, సాంబశివ, సిద్దిగల శ్రీనివాసులు, విశ్వనాథ నాయక్, మండెం సుధీర్, మురళి, వెంకటేష్, కోటేశ్వరరావు, సుమిత్రమ్మ, చిన్నయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మణి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ్ పాల్గొన్నారు.

కృష్ణంరాజుకు జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ 'తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురస్కారం' ఇస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు పత్రికా రంగానికి, తెలుగు భాషా వికాసానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి ఐదో తేదీ సోమవారం ఉదయం నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేస్తామని విజయబాబు తెలిపారు. కృష్ణంరాజు 37 సంవత్సరాలపాటు పాత్రికేయ వృత్తిలో కొనసాగారు. తెలుగు, ఆంగ్ల పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేశారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో 15 పుస్తకాలు రచించారు. అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందారు. జర్నలిస్టు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న కృష్ణంరాజు...నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) సౌత్ ఇండియా కార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 'జర్నలిస్ట్ న్యూస్ అండ్ వ్యూస్' అనే ఆంగ్ల మాస పత్రికకు ముఖ్య సంపాదకులుగా ఉన్నారు. వివిధ అంశాలపై సుమారు ఐదువేల వ్యాసాలు, 900 సంపాదకీయాలు రాశారు. నాలుగు వేలకు పైగా టీవీ డిబేట్లలో పాల్గొన్నారు.

సంపాదకీయం

ఇదీ మన ప్రజాస్వామ్యం

అధికారం సంపాదించడానికి బీజేపీ ఎన్ని ఎత్తులైనా ఎత్తుతుంది. ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుంది. ఈ అంశం మీద ఇంకా అపనమ్మకం ఏమైనా ఉంటే చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల ఫలితాలు గమనించవచ్చు. చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్లో మొత్తం 36 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అందులో బీజేపీకి చెందిన వారు 14 మంది, శిరోమణి అకాలీ దళ్ చెందిన ఒక కార్పొరేటర్ ఉన్నారు. బీజేపీతో గతంలో తెగ తెంపులు చేసుకున్న అకాలీ దళ్ చండీగఢ్ మేయర్ ఎన్నికలలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. అంటే బీజేపీ పక్షాన ఓటు వేసే వారి సంఖ్య 15 కు చేరింది. ఒక్క పార్లమెంటు సభ్యుడూ బీజేకీ చెందిన వారే కనక ఆయననూ లెక్కేస్తే బీజేపీ బలం 16కు పెరుగుతుంది. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ సమైక్యంగా మేయర్ ఎన్నికలలో పోటీకి నిలిచాయి. ఆమ్ ఆద్మీ పార్టీ కార్పొరేటర్లు 13 మంది, కాంగ్రెస్ కు చెందిన ఏడుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ఈ లెక్కలనుబట్టి చూస్తే ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ సంయుక్తంగా నిలబెట్టిన మేయర్ అభ్యర్థి కుల్దీప్ కుమార్ "తీతా" గెలుపు సునాయాసమే కదా అని ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారు ఎవరైనా అనుకుంటారు. కానీ బీజేపీ మాయాజాలంవల్ల అక్కడ బీజేపీ అభ్యర్థి సోంకర్ గెలిచి కూర్చుకున్నారు. ఇంకా విచిత్రం ఏమిటంటే సోంకర్ గెలిచారని ఎన్నికల నిర్వహణాధికారి ప్రకటించిన కొద్ది సెకన్లలోనే ఆయనను మేయర్ కుర్చీ మీద కూర్చోపెట్టేశారు. ఎవరు గెలిచారో ప్రకటించడానికి గణిత శాస్త్రంలో ప్రవీణులు కానక్కర్లేదు. కానీ ఎన్నికల నిర్వహణాధికారిగా వ్యవహరించిన పెద్ద మనిషి బీజేపీ అభ్యర్థి గెలిచారని ప్రకటించారు. ఈ ఎన్నికల మొత్తం కెమెరాల కళ్ల ముందే జరిగింది. దాచడానికి ఏ అవకాశమూ లేదు. కానీ ఎన్నికల నిర్వహణాధికారి బీజేపీకి అనుకూలుడైనప్పుడు గెలుపు బీజేపీ ఖాతాలో పడడంలో ఆశ్చర్యం లేదు. ఓటింగ్ బ్యాలెట్ పత్రాల ఆధారంగానే జరిగింది. బ్యాలెట్ పెట్టెలను తెరిచిన తరవాత ఎన్నికల నిర్వహణాధికారి కొన్ని బ్యాలెట్ పత్రాలను తీసుకుని కెమెరాల కళ్లు కప్పకుండానే వాటి మీద ఏమో రాశారు. చట్ట ప్రకారం వాటిని ఏ రూపంలోనూ మార్చడానికి వీలు లేదు. వాటి మీద ఎన్నికల నిర్వహణాధికారే స్వయంగా రాయడం అంటే దురుద్దేశం ఉందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ ఎనిమిది ఓట్లు చెల్లవని ప్రకటించి పక్కన పడేశారు. ఒకవేళ ఏ ఓటైనా చెల్లకపోతే ఎందుకు చెల్లలేదో కారణం చూపించాలి. కానీ ఇలాంటి నిబంధనలను పాటించే ఎన్నికల నిర్వహణాధికారి కారు కనక ఏ సమాధానమూ ఇవ్వలేదు. బీజేపీ అభ్యర్థి సోంకర్ కు 16 ఓట్లు ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అభ్యర్థికి 12 ఓట్లు వచ్చాయి కనక బీజేపీ అభ్యర్థి గెలిచారని ప్రకటించేశారు. సోంకర్ మద్దతు దార్లు ఆయనను హడావుడిగా తీసుకెళ్లి మేయర్ కుర్చీలో కూర్చోబెట్టేశారు. డిప్యూటీ మేయర్ల ఎన్నిక నిర్వహించేది కొత్తగా ఎన్నికైన మేయరే కనక ఆ ప్రక్రియ కూడా అందరి కళ్లూ కప్పి సునాయాసంగా జరిగిపోయింది. పక్కన పెట్టిన బ్యాలెట్ పత్రాలను ఎన్నికల నిర్వహణాధికారి తీసుకెళ్లడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పుడు కొంత పెనుగులాట జరిగింది. ఎన్నికల నిర్వహణాధికారి కన్ను మూసి తెరిచే లోపల బయటకు తీసుకెళ్లి పోయారు.

"ఇండియా" ఐక్య సంఘటన భాగస్వామ్య పక్షాలు ఉమ్మడి అభ్యర్థిని రంగంలోకి దించి పోటీ చేసిన మొదటి ఎన్నిక ఇదే. అక్రమాలకు పాల్పడి గెలిచినా ఏ మాత్రం సిగ్గు పడకుండా బీజేపీ అధ్యక్షుడు నడ్డా చూశారా మోదీ నాయకత్వంలోని బీజేపీ మొదటి విజయం సాధించింది అని సగర్వంగా ప్రకటించారు. కాదు-ఇండియా ఐక్య సంఘటన మొదటిసారి కలిసి పోటీ చేసిన ఎన్నికలలోనే ఘోరంగా ఓడిపోయింది అని వికటాట్టహాసం చేశారు. మునిసిపాలిటీ దగ్గరి నుంచి పార్లమెంటు అభ్యర్థుల ఎన్నికల దాకా ఏ స్థాయిలోనైనా ఏ అక్రమానికైనా ఒడిగట్టి విజయం సాధించామని చెప్పుకోవడమే మోదీ నాయకత్వంలోని బీజేపీకి అలవాటైన వ్యవహారం. రాష్ట్ర శాసనసభల్లో తమకు మెజారిటీ రాకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది. డబ్బు సంచులు గుమ్మరించి ప్రజా ప్రతినిధులను కొంటుంది. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుంది. చట్ట సభల్లో సీట్ల సంఖ్యను సునాయాసంగా మార్చేసి అధికార పీఠం అధిష్టిస్తుంది. ఓటర్లను ఎంత డబ్బైనా ఇచ్చి కొనడానికి కావలసిన స్తోమత బీజేపీకి ఉంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మీద రాద్ధాంతం జరుగుతోంది. వాటిలో మోసం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తుల దగ్గరనుంచి అనేక వర్గాల వారు రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఫిర్యాదు చేయడానికి ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని కలవడానికి ప్రయత్నం చేస్తే ఆయన అనుమతే ఇవ్వలేదు. మోదీ ఆశీస్సులతో ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారికి నియమితుడైన రాజీవ్ కుమార్ కు ప్రతిపక్ష నాయకులను కలవాల్సిన అవసరం ఎందుకు ఉంటుంది. మోదీ ఆశీస్సులతో అంతా ఏక పక్షంగా నిర్వహించవచ్చునన్న ధీమా ఆయనకు ఉంటుంది. చండీగఢ్ మేయర్ ఎన్నికలలోనూ అదే జరిగింది. ఎన్నికల నిర్వహణాధికారిగా నియమితుడైన వ్యక్తి బీజేపీతో సన్నిహిత సంబంధం ఉన్న వారే. అంతకు ముందు ఆయన బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి కూడా ఎన్నికల నిర్వహణా బాధ్యతను అప్పగించే సాహసం చేయడానికి ఎన్నికల కమిషన్ ఎందుకు వెనుకాడుతుంది గనక! చండీగఢ్ మేయర్ ఎన్నికలలో అన్యాయం జరిగిందని, ఈ ఎన్నికలను బీజేపీ ఎత్తుకు పోయిందని, దౌర్జన్యానికి దిగిందని ఆరోపిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ వెంటనే హై కోర్టును ఆశ్రయించాయి. హై కోర్టు చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారికి, చండీగఢ్ పాలనాధికారికి మూడు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఓ నోటీసు జారీ చేసింది. ఆ వ్యవస్థలు సుప్రీంకోర్టుకు సమయానికి సమాధానం ఇస్తాయని అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. వాయిదాల మీద వాయిదాలు అడుగుతారు. ఈ లోగా సార్వత్రిక ఎన్నికలూ ముగుస్తాయి. మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే. మోదీ ఉదారంగా అనేక గ్యారెంటీలు ఇస్తారు. ఇది నేనిస్తున్న గ్యారంటీ చూసుకోండి అంటారు. ఆరు నూరైనా బీజేపీని ఏ ఎన్నికలలోనైనా గెలిపించే గ్యారంటీని మాత్రం మోదీ కచ్చితంగా నెరవేరుస్తారు. అది ఎంత అడ్డదారైనా కావొచ్చు. బీజేపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ఉన్న ఎన్నికల నిర్వహణాధికారులను నియమిస్తే అడ్డే ఉండదని చండీగఢ్ మేయర్ ఎన్నికలలో తేలిపోయింది. ఎన్నికల కమిషన్ ను, యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి బీజేపీ ఎంత మాత్రం సంకోచించడం లేదు. సకల వ్యవస్థలు, సంస్థలు తమ గుప్పెట్లో ఉన్నప్పుడు బీజేపీకి సంకోచించవలసిన అవసరం ఏముంది. చండీగఢ్ కార్పొరేషన్ ఎన్నికలలో బ్యాలెట్ పత్రాలనే మాయ చేయగల "సాహసిక" అధికారులు మోదీకి ఊడిగం చేయడానికి ఉత్సాహ పడుతున్నప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థానంలో బ్యాలెట్ పత్రాల విధానం అమలు చేయాలని ఉద్యమించడం, ఆక్రోశించడం అరణ్య రోదనే కదా!!

ప్రచారంలో ప్రథమం - మానవాభివృద్ధిలో అధమం

గత మూడేళ్లుగా మానవాభివృద్ధి సూచికలో 191 దేశాలు భూభాగాలలో భారతదేశం 132 వ స్థానంలో ఉంది. 2020 నివేదికలో, 189 దేశాలలో భారతదేశం 131వ స్థానంలో ఉంది. దేశంలో పనితీరు మునుపటి స్థాయి నుండి ఆయుర్దాయం, మానవాభివృద్ధి సూచీ క్షీణిస్తోంది. ఆరోగ్యం, విద్య, ఆదాయ సూచీలతో సహా వివిధ అంశాలపై ప్రభావితమవుతాయి. ఆయుర్దాయం క్షీణించడం అనేది ముఖ్యమైన అంశం, హెచ్‌డిఐ అనేది మిశ్రమ సూచి అని గమనించడం ముఖ్యం. ర్యాంకింగ్‌లలో మార్పులను ప్రతి దేశం అభివృద్ధిని ప్రభావితం చేసే నిర్దిష్ట అంశాలను విశ్లేషించాలి. ర్యాంకింగ్‌లలో మార్పుల వెనుక కారణాలను అర్థం చేసుకోవాలి. విధాన రూపకర్తలు మొత్తం మానవ అభివృద్ధి మెరుగుదల కోసం శ్రద్ధ వహించవలసిన ప్రాంతాలను గుర్తించడంలో సహాయపడతాయి. మానవ అభివృద్ధి అనేది ఆర్థిక వృద్ధి, ఆర్థిక వ్యవస్థలో సంపదను పెంచుకోవడంపై మాత్రమే దృష్టి సారించలేదు. మానవత్వం ఆలోచన చుట్టూ కేంద్రీకృతమై ఉంది, ఇందులో స్వేచ్ఛను విస్తరించడం, సామర్థ్యాలను మెరుగుపరచడం, సమాన అవకాశాలు ప్రోత్సహించడం సంపన్నమైన, ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవితాన్ని నిర్ధారిస్తుంది. భారతదేశం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. అయినప్పటికీ, ఈ పెరుగుదల దాని మానవ అభివృద్ధి సూచిక తగిన పెరుగుదలకు దారితీయలేదు. 2021-22 మానవాభివృద్ధి నివేదిక ప్రకారం, బంగ్లాదేశ్, శ్రీలంక తర్వాత 191 దేశాలలో భారతదేశం 132వ స్థానంలో ఉంది. భారతదేశ పరిమాణం అధిక జనాభా దృష్ట్యా, మానవ అభివృద్ధిలో లేదా రాష్ట్రాల వారీగా అసమానతలను పరిష్కరించడం చాలా కీలకం, ఇది భారతదేశం తన జనాభా భాగాన్ని గ్రహించడంలో సహాయపడుతుంది. బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నాడంట. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో కనీసం పదివేల ఉద్యోగాలు కల్పించలేకపోయారు. మేకిన్ ఇండియా, స్టార్ట్ అఫ్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్లు, ఎంఎస్ఎంఈ లు, కేంద్ర ఉద్యోగ ఉపాధి కల్పన సంస్థలు శిక్షణ సంస్థలు నిధులు లేక జీతాలు లేక వెల వెల పోతున్నాయన్న సంగతి కేంద్ర ప్రభుత్వానికి తెలియదా? యువతకు కేవలం స్విగ్గి,జొమాటో గో డాడీ కొరియర్ అండ్ కార్గో, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ, టెలి కాలర్స్, ఆఫీస్‌బాయ్స్, డ్రైవర్, పెట్రోల్ పంపులో ఆపరేటర్ ఉద్యోగాలు తప్ప గవర్నమెంట్‌లో కొలువులు ఎండమావులే. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పన మా పరిధిలో లేని అంశం అని ఎప్పుడో చేతులెత్తేశాయి. విశ్వవిద్యాలయాలను పటిష్ట పరచకుండా, సాంకేతిక కళాశాల అభివృద్ధి పరచకుండా ఉపాధి శిక్షణ సంస్థలు మెరుగుపరచకుండా ఉపాధి ఎలా లభిస్తుంది. దేశంలో పెరుగుతున్న అధిక ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలు, విభజన రాజకీయాలు, ప్రైవేటీకరణ, ఉత్పాదకత, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం, సమాజంలో సామరస్యత లోపించడం అభద్రతా భావం, ఇండియా కూటమి, పౌరప్రజా సంఘాలతో కలసి ఫోకస్ పెడుతూ అసంఘటిత రంగాన్ని సమీకరిస్తుంటే మరోవైపు పనికిమాలిన సనాతన ధర్మం - దేశం పేరు మార్పు అంశాలు ప్రధాన అంశాలు మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. కేంద్రంలో మోదీ సర్కారు తీరుపై అసంతృప్తితో ఉన్న సాధారణ ప్రజలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలో ప్రస్ఫుటమైనది. 2024 లోక్‌సభ ఎన్నికలకు మరో కొద్ది నెలలు మాత్రమే ఉన్న తరుణంలో గరిష్ట నిరుద్యోగ రేటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, జాబ్ మార్కెట్‌లోకి వస్తున్న కోట్లాది మంది యువతకు ఉద్యోగాలను కల్పించడం బీజేపీ సర్కార్‌కు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. మరోవైపు నిరుద్యోగాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎక్కువగా ఎత్తి చూపుతుంది. దీన్ని మోదీ ప్రభుత్వ వైఫల్యంగా ప్రతిపక్షాలు ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. మోదీ పాలన నిరుద్యోగుల పాలిట శాపంగా మారుతోంది. కేంద్రం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు, ప్రైవేటీకరణ లక్ష్యంగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వడం వెరసి భారత్‌లో నిరుద్యోగం ఏటికేడూ పెరిగిపోతున్నది. కార్పొరేటు ఎగవేతదారులకు లబ్ధి చేకూరే విధంగా పన్నెండు లక్షల కోట్లు బ్యాంకు రుణాలు రద్దు చేసారంటే ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తున్నాయో అర్థమవుతుంది. ఈ సారి కూడా భారత్‌లో గతేడాది డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు 8.30 శాతానికి పెరిగింది. ఇది 16 నెలల గరిష్టం కావడం గమనార్హం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి నుంచి వెలువడిన నివేదికలో వెల్లడైంది.

డా. యం. సురేష్ బాబు
ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

విద్య, వైద్య రంగాలకు నిధులు పెరిగేనా...

పతకమూరు దామోదర్ ప్రసాద్

మనదేశ అభ్యున్నతికి అత్యంత కీలకమైన విద్య, ఆరోగ్య రంగాలకు నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కెంద్రబడ్జెట్లో నిధుల కేటాయింపులు తగ్గిస్తూ రావడం శోచనీయమని ఆయా రంగాల నిపుణులు భావిస్తున్నారు. దేశ ప్రజలందరికీ రూ.10లక్షల ఆరోగ్యబీమా కల్పించే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రకటించిన ప్రధాని మోదీ ఆ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలులోకి తెచ్చి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన తరుణంలో ఇలా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిస్తూ రావడం సరికాదని ఆరోగ్యరంగ నిపుణులు అంటున్నారు. మోదీ 2వసారి అధికారంలోకి వచ్చిన 2019-20 ఆర్థిక సంవత్సరంలో విద్యారంగానికి 2.4శాతం నిధులు కేటాయించారు. కానీ ఆతర్వాత 2020-21, 2023-24లలో విద్యారంగానికి కేటాయింపులు 2శాతం కంటే తక్కువే కావడం గమనార్హం. 2019-20 ఆర్థిక సంవత్సరంలో విద్యా రంగానికి 3.3శాతం నిధులు కేటాయించారు. కానీ ఆతర్వాత 2021-22 లో ఆ కేటాయింపులను 2.2శాతానికి, 2023-24లో 2.5శాతానికి తగ్గించినట్లు సవరించిన బడ్జెట్ అంచనాలను బట్టి తెలుస్తున్నది. 142కోట్ల జనాభాగల సువిశాల భారత్‌లో ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నిధులు ఏ మూలకూ చాలవనేది సుస్పష్టం. ఆయుష్మాన్ భారత్ కింద బీమా మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచడం హర్షణీయం. మన విద్యార్థులు, యువతను శాస్త్ర సాంకేతిక, మానవ విజ్ఞాన శాస్త్రాలలో నిష్ణాతులనుచేసి అంతర్జాతీయంగా సామర్థ్యంలో మేటిగా నిలపాలంటే వారికి నాణ్యమైన విద్యనందించాలి. అందుకోసం విద్యపై చేసే వ్యయాన్ని భారీగా పెంచాలి.

విద్యకు జిడిపిలో 6శాతం ఖర్చు చేస్తేనే భావిభారత పౌరుల నైపుణ్యాలు పెరుగుతాయని నూతన విద్యా విధానంలో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం ఆచరణలో ఇలా నిధులు తగ్గించడం సరికాదు. అసంఘటిత కార్మికులు, కేంద్రప్రభుత్వ ఉద్యోగుల పింఛన్ల కోసం చేసే వ్యయాన్ని కూడా 2022-23లో 9.7శాతానికి, 2023-24లో 10శాతానికి తగ్గించడం గమనార్హం. విద్య, ఆరోగ్యం, వంటి సామాజిక సంక్షేమ పథకాలకు మోదీ ప్రభుత్వం ఇలా నిధులు తగ్గించడం సరికాదు. 2020-21లో ఈ రంగాలకు 12శాతం కేటాయింపులు ఉండేవి. తీసుకున్న రుణాలపై వడ్డీల చెల్లింపులు, ప్రజలకు ఆహారం, ఇంధనం, రైతులకు సబ్సిడీ ధరలకు ఎరువుల సరఫరాకు బడ్జెట్‌లో 3వ వంతు నిధుల కేటాయింపు ఉంటుంది. దేశ సరిహద్దుల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు మరో 12శాతం నిధులను ఖర్చు చేయవలసి ఉన్నందున విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు నిధులకోత విధించక తప్పదని అంటున్నారు. యూరప్ దేశాలు కూడా 20వ శతాబ్దం ఆఖరి వరకు తమ దేశాల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు ఎక్కువ బడ్జెట్ మొత్తాలను

ఖర్చు చేసేవి. కానీ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు ఇటీవలి సంవత్సరాలలో విద్య, బాలల సంక్షేమం అన్వస్థుల ఆరోగ్య రక్షణ, ఉద్యోగ విరమణ చేసిన వృద్ధులకు మెరుగైన సౌకర్యాల కల్పన, దుర్బల వర్గాలకు, ఇతరులకు సామాజిక సంక్షేమ పథకాల అమలుపై ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నాయని ఐఎంఎఫ్ పత్రిక వెల్లడించింది. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గగా, మరోవంక కరోనా మహమ్మారి ప్రబలి 2020-21లో ఆహార సబ్సిడీల వ్యయం పెరిగింది.

కరోనా ప్రబలిన తొలి ఏడాది బడ్జెట్లో 15.4శాతం ఆరోగ్య సబ్సిడీల కోసం ఖర్చు చేశారు. అయితే ఆతర్వాత వీటిని 2021-22లో ఆవ్యయాన్ని 7.2 శాతానికి, 2023-24లో 4.38 శాతానికి తగ్గించారు. దేశంలో కరోనా ప్రబలడానికి ముందు 2019-20లో బడ్జెట్లో 4.04శాతం మొత్తాన్ని ఆహారసబ్సిడీగా ఖర్చు చేశారు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో కూడా ఆహార సబ్సిడీ అంతే. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనలో భాగంగా పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించే పథకాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో ఐదేళ్లు పొడిగించినందున 81 కోట్ల మంది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత బియ్యం ఇతర ఆహార ధాన్యాల సరఫరా వ్యయం, సబ్సిడీ మొత్తం మరింత పెరగనుంది. వచ్చే ఐదేళ్లలో ఇందుకు రూ.12 లక్షల కోట్లు ఖర్చు కాగలదని అంచనా. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రస్తుతం రైతులకు ఏటా మూడు విడతలుగా రూ.2వేల వంతున రూ.6వేలు వారి ఖాతాలకు కేంద్రం జమచేస్తున్నది.

రూ 10వేలు సాయంగా ఇవ్వాలని, వర్షాభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పంపిణీ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరలు తగ్గినా భారత్‌లో వినియోగదారులకు వంటగ్యాస్, డీజిల్, పెట్రోలు ధరలు తగ్గించననందున, బియ్యం,నూనెలు, పప్పులధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారు. వంటగ్యాస్ ధరలు భారీగా పెంచడాన్ని నిరసిస్తూ కర్ణాటక ప్రజలు ముఖ్యంగా మహిళలు బీజేపీ పార్టీని గద్దె దించిన సంగతి తెలిసిందే. తెలంగాణాలో తామే అధికారానికి వస్తామని కమలనాథులు ఉవ్వెత్తున ప్రచారం చేసినా 8 స్థానాలే దక్కాయి. ప్రజలు ఆ అవకాశం ఇవ్వకుండా 8 అసెంబ్లీ స్థానాలు మాత్రమే అనుగ్రహించారు. హిందీ రాష్ట్రాలలో కమలం వికసించినా దక్షిణ, తూర్పు రాష్ట్రాల ప్రజలు ఆపార్టీ పై ఆగ్రహంగానే ఉన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ వంటి రాష్ట్రాలలో మహిళలు,దళితులు,ఆదివాసీలను ఆకట్టుకుని తాయిలాలు ఇచ్చి ముందస్తు వ్యూహంతో మోదీ ఆకట్టుకున్నారు. ఇండియా కూటమి పక్షాలను చీల్చడంలో మోదీ విజయం పొందారు. బిహార్‌లో నితీశ్‌ను బీజేపీలోకి ఆకట్టుకుని ప్రభుత్వాని కూల్చారు. తొలినుంచి మోదీకి ఉన్న అలవాటు ఇదే. అధికారం తనదేననే ధీమాలో ఉన్నారు. ఇప్పుడు మహిళలను ఆకట్టుకోవడానికి వంట గ్యాస్ ధర రూ.300 తగ్గిస్తామంటున్నారు. ఈ తగ్గింపునకు ఉజ్వల పథకం వారికే గాక ఇతర పేద, మధ్య తరగతి ప్రజలకు వర్తింపజేస్తే వారికి ఊరట కలుగుతుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న సమర్పించే తాత్కాలిక బడ్జెట్లో కొంతవరకైనా ఊరట కలిగిస్తారని జనం ఆశాభావంతో ఉన్నారు. గత బడ్జెట్లో ప్రతి వైద్య కళాశాలకు అనుబంధంగా 157 నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని, మారుమూల ఆదివాసీ ప్రాంతాలలో రక్తహీనత వల్ల బలహీనంగా ఉన్న నిరుపేదలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బలవర్ధక ఆహారం అందిస్తామని ఇచ్చిన హామీ ఇంకా పూర్తిగా అమలుకాలేదు. కరోనా సాకుతో వయోవృద్ధులు, మహిళలు, జర్నలిస్టులకు రైలు ప్రయాణాలకు మునుపటి ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీలు రద్దు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిది. ఈసారి అయినా ఆ రాయితీలు పునరుద్ధరించాలని వారు కోరుకుంటున్నారు. శుష్క ప్రియులు...శూన్య హస్తాలయితే ప్రజలకు ఊరట ఎక్కడ.

సీనియర్ జర్నలిస్టు

విచ్చలవిడిగా అనుమతిలేని తెగుళ్ల మందులు

పి.జమలయ్య

బయోలు పేరుతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అనధికారికంగా పురుగు, తెగుళ్ళ మందులు విక్రయాలు సాగుతున్నాయి. ఆర్గానిక్ మందులు, జీవ రసాయనాలు అంటూ తయారుచేసి రైతుల్ని దోచుకుంటున్నారు. కొందరు తయారీదారులు ఈ మందులను వాహనాల్లో వేసుకొని గ్రామాలు, పొలాల్లోకి వెళ్లి విక్రయిస్తున్నారు. కొన్ని పురుగు మందుల దుకాణాల్లోనూ, ఈ తరహా మందులను అనధికారికంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున కమిషన్ల ఆశ చూపడం, ఇతర రాష్ట్రాలకు పర్యటనలు, ప్యాకేజీలు ప్రకటించి డీలర్లు ఆకట్టుకుంటున్నారు. సమావేశాలు ఏర్పాటుచేసి బహుమతులు ఇస్తున్నారు విందులు పెడుతున్నారు. ఆ మందు పంటలపై ఎంతమేర పని చేస్తుందనే విషయాన్ని పక్కన పెట్టి రైతులకు అప్పులపై అంటకడుతున్నారు. ఫలితంగా పంటలపై పెట్టుబడి పెరుగుతుంది. రైతుల అప్పులు పాలు అవుతున్నారు. మొత్తం పిచికారి మందుల దుకాణాల్లో ఆర్గానిక్, బయో మందుల వాటా 50శాతం పైన ఉంటాయని అంచనా.

వ్యవసాయం అంటే భూమిలో సారం, నీటిలో నాణ్యత, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తగిన ప్రమాణాలతో రైతులకు అందుబాటులో ఉండాలి. వీటితోపాటు పరపతి సౌకర్యం అత్యంత కీలకమైనది. అన్ని సానుకూలంగా ఉన్న పర్యావరణంలో వచ్చే మార్పులు, ప్రకృతి విపత్తులు నుండి తట్టుకొని పంట పండించాలి. పండిన పంటను మార్కెట్‌లోకి తీసుకెళ్లి కనీసం మద్దతు ధరలకైనా అమ్ముకునే వెసులు బాటు రైతులకు ఉండాలి. అప్పుడే వ్యవసాయంలో రైతులకు జీవనోపాధి నిలకడగా ఉంటుంది. లేకపోతే ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందులో భాగంగానే ఈరోజు రైతులు తీవ్రంగా నష్టపోవడానికి ప్రకృతి విపత్తులు ఒక కారణమైతే ఎరువులు, పురుగు మందులు, విత్తనాల్లో నాణ్యత లేకపోవడం పంటలు దెబ్బతినటంతో అప్పుల్లోకి కూరుకు పోతున్నారు. ముఖ్యంగా చీడపీడలు ఆశించినప్పుడు పిచికారి చేసే మందులు కానీ, పంటలకు బలాన్ని ఇచ్చే ఎరువులు గాని నాణ్యతగా ఉండాలి. పైన చెప్పిన విధంగా రసాయనమందులతో పాటు బయో ఉత్పత్తులు విచ్చలవిడిగా మార్కెట్‌లో అమ్ముతున్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా కంపెనీలకు చుట్టాలుగా మారుతున్నాయి. బయో పేరుచెప్పి దేశవ్యాప్తంగా ఏటా వేలకోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. జీవ ఉత్ప్రేరకాలు తయారీ విషయంలో ప్రత్యేకంగా ఎటువంటి నియమాలు,నమూనాలు లేకపోవడంతో కంపెనీలు ఏ మిశ్రమాలతో తయారు చేస్తున్నారో, లేబరేటరీ ఫీల్డ్ ట్రయల్స్ ఫలితాలు ఏమిటో తెలియటం లేదు. పైగా ప్యాకింగ్‌పై లేబుల్ ఉండటం లేదు. బయో ఉత్పత్తులైన ఎరువులు, పురుగు మందులు నియంత్రణ చట్టం పరిధిలో లేకపోవడంతో కంపెనీలను ప్రభుత్వాలు అదుపు చేయలేకపోతున్నాయి. ప్రభుత్వాలకు ఎటువంటి పన్నులు కూడా చెల్లించడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో 1200 పైగా ఉన్న ఈ కంపెనీల ద్వారా లెక్కకు మించి బయో ఉత్పత్తులు ఏటా మార్కెట్లోకి వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంతో 264 కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఈ కంపెనీలు తరచూ కోర్టులను ఆశ్రయించడం చట్ట పరిధిలో లేనందున నియంత్రించే అధికారం లేదంటూ కోర్టులు ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేకులు వేయడంతో వీటిని నియంత్రించే పరిస్థితి లేకుండా పోయింది. ఈ కంపెనీల ద్వారా మన రాష్ట్రంలో సుమారు ప్రతి ఏటా రెండు వందల కోట్లు నుంచి 400 కోట్లు వరకు వ్యాపారం జరుగుతుంది.

రైతుల ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం వీటిని ఎరువుల నియంత్రణ చట్టం పరిధిలోకి తీసుకురావడమే కాకుండా ఆ మేరకు ప్రత్యేకంగా గెజిట్ విడుదల చేసి ఉత్పత్తుల రకాలను వర్గీకరించింది. సముద్ర కలుపు మొక్కలతో సహా వివిధ రకాల మొక్కల నుంచి సంగ్రహించిన జీవ సంబంధిత పదార్థాలు, జీవ రసాయనాలు (బయో కెమికల్స్, ప్రోటీన్ హైడ్రో లైసెట్స్, అమైనో ఆమ్లాలు, విటమిన్లు, కణరహిత సూక్ష్మజీవుల ఉత్పత్తులు) హ్యూమిక్, ఫల్విక్ ఆమ్లాలాంటివి ఉత్పత్తులను ఈ షెడ్యూల్లో చేర్చారు. బయోలు తయారీ అమ్మకాలను నియంత్రిస్తూ కేంద్ర ఎరువుల నియంత్రణ చట్టం 1985 షెడ్యూల్ 6 ను సవరించింది. బయో ఉత్పత్తులను ఈ చట్టం పరిధిలోకి తీసుకువచ్చింది. తయారీదారులు, దిగుమతి దారులు ఫారం- జీ ద్వారా రిజిస్ట్రేషన్ కేంద్ర ఎరువుల నియంత్రణ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కడైతే తయారు చేస్తున్నారో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వ్యవసాయశాఖ నుంచి ఫారం జి-2ను పొందాలి. దీని ద్వారా ఎరువుల కంట్రోలర్ నుంచి ప్రొవిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఫారం జి-3ను తీసుకోవాలి. ఈ సర్టిఫికెట్ ఆధారంగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ నుంచి పొందే ధ్రువీకరణ పత్రం ద్వారా రెండేళ్ల కాలపరిమితితో తయారీ, అమ్మకాలు కొనసాగించవచ్చును. ఈ కొత్త చట్టం ప్రకారం ప్రతి బయో ఉత్పత్తికి నాణ్యత నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా ఉండాలి. ఇందుకోసం ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక లాబరేటరీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచన చేసింది. బయో ఉత్ప్రేరకాలు తయారీదారులు, పంపిణీ దారులే కాదు అమ్మకాలు చేపట్టే వ్యక్తులు కూడా ఇక సవరించిన ఎరువుల నియంత్రణ చట్టం 2021 నియమాలకు లోబడి నడుచుకోవాలి. అతిక్రమిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటారని చట్టంలో పేర్కొన్నారు.

బయో ఉత్పత్తుల విక్రయానికి సంబంధిత కంపెనీలు ఫారం-జి2 ద్వారా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వీటిని పరిశీలించిన తర్వాతే కమిషనర్ ఫారం- జి 2 ద్వారా అనుమతులు ఇస్తున్నారు. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ కమిషనర్ 47 కంపెనీలకు చెందిన 662 బయో ఉత్పత్తులకు మాత్రమే అనుమతులు ఇచ్చారు. ఇతర జిల్లాలకు చెందిన వారు ఫామ్- జి2 అనుమతులు పొంది ఉంటే మార్కెటింగ్ చేసుకునే జిల్లాలో తగిన అనుమతులు పొందాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆమోదం పొందిన బయో ఉత్పత్తులను అమ్ముకునేందుకు 2024 ఫిబ్రవరి 22 వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. చట్టం ఇంత పగడ్బందీగా ఉన్నప్పటికీ వ్యవస్థలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని బయో ఉత్పత్తులను విచ్చలవిడిగా మార్కెట్ చేస్తున్నారు. క్రిమిసంహారక చట్టం ప్రకారం రసాయనాలను ఉపయోగించే తయారీదారులు లైసెన్సులు పొందాలి. దీనితో పాటు వ్యవసాయ శాఖలో నమోదు చేసుకోవాలి. బయో ప్రొడక్ట్స్ తయారీదారులు లైసెన్స్ లేకుండనే విచ్చలవిడిగా బయట మార్కెట్లో తమ ఉత్పత్తుల అమ్ముకొని లాభాలను దండుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సంఘాల వత్తిడి మేరకు ఇటీవల కాలంలో వ్యవసాయశాఖ కొన్ని శాంపిల్స్ సేకరించి పరిశీలించగా లైసెన్స్ పొందిన బయో పెస్టిసైడ్స్ కంటే బహిరంగ మార్కెట్‌లో రైతులకు విక్రయించే బయో ఉత్పత్తులు భిన్నంగా ఉన్నాయి. అనుమతి లేని బయో ఉత్పత్తులలో ఎక్కువ మోతాదులో రసాయనాలు కలిపి విక్రయించి రైతులను మోసగిస్తున్నారని తేలింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సైంటిస్టుల బృందాలను ఏర్పాటు చేయాలి. వ్యవసాయ సిబ్బందితో తనిఖీలు చేయించాలి. జిల్లాకు ఒక లాబరేటరీ ఏర్పాటు చేసి శాంపిల్స్ ఉత్పత్తులను సేకరించి నాణ్యతను నిర్ధారించాలి. కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఫామ్ జి, ఫామ్ జి 2, ఫామ్ జీ 3 తీసుకోవాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఆదేశాలు జారీచేసి అమలు చేయాలి.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం.

ముందుగా... మద్దతు లేఖలు సిద్ధం

జార్ఖండ్ సీఎం సోరెన్ వ్యూహాత్మక ఎత్తుగడ

రాంచీ : ఈడీ దాడుల నేపథ్యంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. బుధవారం జరిగిన సమావేశంలో రెండు ఖాళీ కాగితాలపై జేఎంఎం ఎమ్మెల్యేల సంతకాలు తీసుకున్నారు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం, ఆ పత్రాలు సీఎం పదవికి అభ్యర్థులైన కల్పనా సోరెన్, చంపాయ్ సోరెన్‌లకు మద్దతు లేఖలు. అయితే హేమంత్ సోరెన్ అరెస్టును ఎదుర్కొన్న పక్షంలో ఒక లేఖను గవర్నర్‌కు సమర్పించవచ్చు. ఇందులో మొదటి లేఖ హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేస్తే రాష్ట్ర పగ్గాలు చేపడతారని భావిస్తున్న ముఖ్యమంత్రి భార్య కల్పనా సోరెన్‌కు మద్దతుగా ఉండగా, రెండవ లేఖ నాయకత్వ పాత్ర కోసం సీనియర్ జేఎంఎం నాయకుడు చంపై సోరెన్‌కు మద్దతు ఇస్తుంది. అయితే ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరుకాలేదు. ఏడుగురు జేఎంఎం ఎమ్మెల్యేలు ఈ ప్రత్యేక సమావేశానికి గైర్హాజరయ్యారు. ఇది పార్టీ శ్రేణులలో ఎలాంటి విఘాతం కలిగిస్తుందనే దాని గురించి ప్రశ్నలు లేవనెత్తింది. ఇదిలా ఉండగా, హేమంత్ సోరెన్ తమ్ముడు బసంత్ సోరెన్, ముఖ్యమంత్రి కోడలు సీతా సోరెన్‌కు 18 మంది

జేఎంఎం ఎమ్మెల్యేల మద్దతు ఉందని చెబుతున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు శిబూ సోరెన్ కూడా బసంత్ సోరెన్ వాదనకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర శాసనసభలో అధికార కూటమికి ప్రస్తుత బలం 49 మంది. ఇందులో జేఎంఎం నుంచి 29, కాంగ్రెస్ 16, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు-లెనినిస్ట్) లిబరేషన్ (సీపీఐ-ఎంఎల్-ఎల్), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నుంచి ఒక్కొక్క ఎమ్మెల్యే ఉన్నారు. భూముల కుంభకోణం కేసుతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ విచారణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జార్ఖండ్ ముఖ్యమంత్రి ఇంటికి వచ్చినప్పుడు ఈ పరిణామం జరిగింది. ఈ కేసుకు సంబంధించి అధికార జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు కూడా అయిన సోరెన్‌ను జనవరి 20న విచారణ చేశారు. ఇదిలాఉండగా, ఈడీ తన నివాసానికి రావడంపై హేమంత్ సోరెన్ ఆదివారం ఒక ఇమెయిల్ లేఖలో స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలకు విఘాతం కలిగించేందుకు 'రాజకీయ ప్రేరేపిత అజెండా' అని ఆరోపించారు. జనవరి 31 లేదా అంతకు ముందు తన వాంగ్మూలాన్ని మళ్లీ నమోదు చేయాలని పట్టుబట్టడం 'ద్వేషపూరితమైనది' అని పేర్కొన్నారు. దిల్లీలోని ఆయన ఇంట్లో సోమవారం సోదాలు జరిపిన దర్యాప్తు సంస్థ రూ.36 లక్షలు, రెండు బీఎండబ్ల్యూలు, కొన్ని నేరారోపణ పత్రాలను స్వాధీనం చేసుకుంది. జార్ఖండ్‌లో 'మాఫియా ద్వారా భూ యాజమాన్యాన్ని అక్రమంగా మార్చే భారీ రాకెట్' పై విచారణలో భాగంగా సోరెన్‌ను ప్రశ్నిస్తున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

కేజ్రీవాల్‌కు ఐదోసారి ఈడీ సమన్లు

న్యూదిల్లీ: ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఫిబ్రవరి 2న విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఇప్పటికే నాలుగుసార్లు సమన్లు జారీ చేసినా కేజ్రీవాల్ హాజరుకాలేదు. తొలుత నవంబరు 2న, ఆ తర్వాత డిసెంబరు 21, జనవరి 3, జనవరి 18న తమ ఎదుట విచారణకు హాజరుకావాలంటూ ఈడీ సమన్లు జారీ చేసింది.

అయితే, వివిధ కారణాలు చూపి ఆయన వాటిని తిరస్కరించారు. ఈ క్రమంలోనే తాజాగా ఐదోసారి ఆయనను విచారణకు పిలిచింది. ఈసారి కేజ్రీవాల్ గైర్హాజరైతే అరెస్టు వారెంట్ నిమిత్తం కోర్టును ఆశ్రయించాలని దర్యాప్తు సంస్థ భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ఈ సమన్లు చట్టవిరుద్ధమైనవని కేజ్రీవాల్ ఆరోపించారు. రాజకీయ కుట్రలో భాగంగానే తనను విచారణకు పిలుస్తున్నారని కేంద్రాన్ని దుయ్యబట్టారు. తన జీవితంలో దాచడానికి ఏమీ లేదని, తాను ఈ సమన్లు స్వీకరించబోనని గతంలో చెప్పారు. కాగా, మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ... కేజ్రీవాల్‌ను విచారించిన విషయం తెలిసిందే. గతేడాది ఏప్రిల్‌లో ఆయనను 9 గంటల పాటు ప్రశ్నించారు. తాజాగా ఈడీ నమోదు చేసిన కేసులోనూ ఆయనకు సమన్లు అందాయి. ఇదే కేసులో దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను అరెస్టు చేశారు.

కాగా, కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు పంపడంపై ఆప్ తర్జనభర్జన పడుతోంది. ఈ విషయంపై న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది. అదే సమయంలో ఈడీ సమన్లు జారీ చేయడంపై విమర్శలు గుప్పించింది. కేజ్రీవాల్ అరెస్టు లక్ష్యంగా మోదీ సర్కారు పనిచేస్తోందని మండిపడింది.

ఒంటరి పోటీపై స్పష్టత ఇవ్వండి

ఇండియా కూటమి పార్టీలకు కాంగ్రెస్ విజ్ఞప్తి

కతిహార్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీట్ల సర్దుబాటు విషయంలో 'ఇండియా కూటమి పార్టీలు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ, పంజాబ్‌లో ఆప్ ఒంటరిగా పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించాయి. మరోవైపు కూటమికి షాకిస్తూ బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఎన్‌డీయేతో జట్టు కట్టారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీపై కాంగ్రెస్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటివరకు కూటమిలో సీట్ల సర్దుబాటు ప్రక్రియపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఇలాంటి పరిస్థితుల్లో కూటమిలోని పార్టీలన్నీ ఒకే గొంతుక వినిపించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదని, ప్రస్తుతం ఇండియా కూటమిలో మూడు పార్టీలు ఉన్నాయని, ఒకవేళ వాళ్లు ఒంటరిగా పోటీ చేయాలనుకుంటే... దానిపై ప్రకటన చేయాలని కోరారు. పశ్చిమబెంగాల్‌లో కూడా కూటమి కలిసి పోరాడుతుందని భావిస్తున్నట్లు జైరాం రమేశ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా విపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది చివర్లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయడంతో కూటమి పార్టీలు అసంతృప్తి వ్యక్తంచేశాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ ముందుకు రాకపోవడంతో కూటమి నుంచి పార్టీలు ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి.

కులగణన ఆలోచన నాదే

ఇండియాకు ఆ పేరు వద్దన్నా

రాహుల్ వ్యాఖ్యలపై నితీశ్ ఎదురుదాడి

పాట్నా: కాంగ్రెస్ ఒత్తిడితోనే బీహార్‌లో కులగణన జరిగిందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలను జేడీయూ అధ్యక్షుడు, సీఎం నితీశ్ కుమార్ తోసిపుచ్చారు. మరొకరు చేసిన పనిని తామే చేసినట్లు రాహుల్ తన ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. నితీశ్‌కుమార్ బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీహార్‌లో కులగణన తన చొరవతో జరిగిందన్న విషయం అందరికీ తెలుసని, 2019-20 మధ్య అసెంబ్లీ సహా బహిరంగ సభల వరకు ప్రతిచోటా ఈ విషయాన్ని ప్రస్తావించానని చెప్పారు. ఈ విషయంపై ప్రధానిని కూడా కలిశానని, దీనికి ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు లబ్ధి పొందాలనుకుంటే తాను పట్టించుకోబోనని నితీశ్ అన్నారు. రాహుల్‌వి అర్థంలేని వ్యాఖ్యలని ఆయన అన్నారు. ఇండియా కూటమిలోని పార్టీలు ఏమి చేయట్లేదని, కనీసం సీట్ల సర్దుబాటుపైనా చర్చించడం లేదని నితీశ్ అన్నారు. కూటమికి 'ఇండియా' అని పేరు పెట్టాలని తాను చెప్పలేదని, వాళ్లే నిర్ణయం తీసుకున్నారన్నారు. అసలు ఆ పేరు పెట్టడం తనకు ఇష్టం లేదని, కాంగ్రెస్, ఇతర పార్టీలకు కూడా తాను సూచించానని, అయినా వినలేదని నీతీశ్ వివరించారు. ఇకపై ఎన్‌డీయేను వీడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్‌ను ఈడీ విచారించడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ లాలుపై ఉన్న ఆరోపణల గురించి అందరికీ తెలిసిందేనని, దర్యాప్తు జరుగుతోందని అన్నారు. వాటి గురించి తాను ఎవరినీ అడగలేదని, తనకు ఎవరూ చెప్పలేదని చెప్పుకొచ్చారు. గతవారం ఇండియా కూటమిని వీడి, బీజేపీతో చేతులు కలిపిన నితీశ్ కుమార్‌పై భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్‌గాంధీ విమర్శలు చేశారు. నితీశ్ విపక్ష కూటమిని ఎందుకు వీడారో తెలుసునని, బీహార్‌లో కులగణన చేపట్టాలని తాము ఆయనకు స్పష్టంగా చెప్పామని,. దీనిపై కాంగ్రెస్, ఆర్జేడీ ఒత్తిడి తీసుకువచ్చాయని, అందుకు బీజేపీ వ్యతిరేకంగా నిలిచిందని, దీంతో నితీశ్ ఇరుక్కుపోయారని రాహుల్ చెప్పారు. ఏ కొంచెం ఒత్తిడి వచ్చినా యూటర్న్ తీసుకోవడం నితీశ్‌కు అలవాటేనని విమర్శించారు.

చైనా సైనికులకు గొర్రెలకాపరులు ఝలక్

వాస్తవాధీన రేఖ వద్ద అరుదైన ఘటన

శ్రీనగర్: వాస్తవాధీన రేఖ వద్ద మన గొర్రెలకాపరులు చైనా సైన్యానికి ఎదురొడ్డి నిలబడ్డారు. ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సరిహద్దు ప్రాంతంలో భారత భూభాగం వైపు జీవాలు(గొర్రెలు) మేపొద్దంటూ పీఎల్‌ఏ దళాలు అభ్యంతరాలు తెలిపాయి. అయినా గొర్రెలకాపరులు లెక్కచేయలేదు. మన సైన్యం సాయంతో అక్కడి నుంచి చైనా సేనలను వెనక్కి పంపించారు. లద్దాఖ్‌లోని కాక్‌జంగ్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను చుషుల్ కౌన్సిలర్ కొంచోక్ స్టాంజిన్ షేర్ చేశారు. కొద్దిరోజుల క్రితం కాపరులు, చైనా సైన్యానికి మధ్య వాగ్వాదానికి సంబంధించిన వీడియోను కొంచోక్ షేర్ చేశారు. గొర్రెలకాపరులు ఆ ప్రాంతాన్ని వీడాలని చైనా సైనికులు హారన్ కొట్టి సంకేతాలు ఇచ్చారు. తాము భారత భూభాగం వైపే మేపుతున్నామని వారు స్పష్టంగా చెప్పేశారు. వారి మధ్య గొడవ ముదిరినప్పుడు కాపరులు రాళ్లు తీయడం ఆ వీడియోలో కనిపించింది. అయితే... రెండు వర్గాల మధ్య ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు. 2020 ఏప్రిల్‌లో గల్వాన్ వద్ద భారత్-చైనా సైన్యాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘటనలో 20 మంది భారత జవాన్లు మరణించారు. 1967 తర్వాత భారత్-చైనా మధ్య జరిగిన అతిపెద్ద ఘర్షణ ఇదే. అప్పటినుంచి వాస్తవాధీన రేఖ సమీపంలో సంచార జాతులు గొర్రెలు మేపడం మానేశాయి. మూడేళ్ల తర్వాత మొదటిసారి భారత సైన్యం సహాయంతో కాపరులు... పీఎల్‌ఏ దళాలకు తమ హక్కును స్పష్టంగా తెలియజేశారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు నకిలీ సర్టిఫికెట్లు

సాక్షిమాలిక్ విమర్శ

న్యూదిల్లీ: సస్పెన్షన్‌కు గురైన సంజయ్ సింగ్ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ చాంపియన్ షిప్‌లు నిర్వహించడంతో పాటు నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఒలింపిక్ విజేత, ప్రముఖ రెజ్లర్ సాక్షి మాలిక్ బుధవారం ఆరోపించారు. రెజ్లర్ల ఆందోళనలతో వెనక్కి తగ్గిన కేంద్రం... కొత్తగా ఎన్నికైన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడిని సస్పెండ్ చేసింది. ప్రస్తుతం కేంద్రం నియమించిన అడ్‌హక్ కమిటీ ఫెడరేషన్ కార్యకలాపాలు పర్యవేక్షిస్తోంది. అయితే సస్పెండ్‌కు గురైన సంజయ్‌సింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఈ పోటీలు ఎలా నిర్వహిస్తారని, వారు జారీ చేసే నకిలీ సర్టిఫికెట్లు భవిష్యత్తులో క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేస్తాయని సాక్షి మాలిక్ హెచ్చరించారు. ఫెడరేషన్ నిధులను ఎలా దుర్వినియోగం చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో క్రీడలమంత్రి అనురాగ్ ఠాకూర్ జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వాస్తవానికి క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో జైపూర్‌లో జాతీయ రెజ్లింగ్ చాంపియన్ షిప్ జరగనుంది. కానీ తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి సంజయ్ సింగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లు నిర్వహిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్నారని సాక్షి మాలిక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ సర్టిఫికెట్‌లతో క్రీడాకారులకు ఉద్యోగాలు రావని, వారి తప్పు లేకపోయినా కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి భవిష్యత్తు నాశనం కాకుండా సంజయ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె విన్నవించారు.

సోరెన్ అదృశ్యం వెనుక కేజ్రీవాల్: బీజేపీ

రాంచీ: కొన్ని గంటల పాటు కనిపించకుండా పోయిన ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తిరిగి రాంచీ చేరుకోవడంపై బీజేపీ విమర్శలు గుప్పించింది. ఆయన దిల్లీ నుంచి రాంచీకి వచ్చేందుకు సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహాయం చేసినట్లు ఆ పార్టీ నేత నిషికాంత్ దూబే ఆరోపించారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న హేమంత్ సోరెన్‌ను విచారించేందుకు ఈడీ అధికారులు దిల్లీలోని ఆయన నివాసానికి సోమవారం వచ్చారు. రాత్రి వరకు ఎదురు చూసినా ఆయన రాలేదు. దీంతో ఆయనకు చెందిన రెండు కార్లు, రూ.36 లక్షల నగదు, కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకుని అధికారులు వెళ్లిపోయారు. ఆ తర్వాత దిల్లీ నుంచి రాంచీకి సోరెన్ చేరుకున్నారు. సంకీర్ణ ప్రభుత్వ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. హేమంత్ సోరెన్ తిరిగి రాంచీ చేరుకోవడానికి కేజ్రీవాల్ సహాయం చేసినట్లు తమకు సమాచారం అందిందని, దిల్లీ నుంచి వారణాసికి చేరుకున్న సోరెన్‌ను... అక్కడి నుంచి ఝార్ఖండ్ మంత్రి ఒకరు రాంచీకి తీసుకెళ్లారని ఎక్స్(ట్విటర్)లో నిషికాంత్ దూబే ఆరోపించారు. ఇద్దరు నేతలు కలిసి కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోరెన్ ఏర్పాటు చేసిన సమావేశానికి 35 మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారని, ఆయన సతీమణి కల్పనా సోరెన్‌కు సీఎం బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనపై సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదని పేర్కొన్నారు.

మనోవ్యాధిని వెల్లడించని భారతీయులు

న్యూదిల్లీ: తమకు మానసిక అస్వస్థత ఉందని స్వయంగా తెలిపేవారి సంఖ్య భారత్‌లో ఒక్క శాతానికి లోపేనని 2017-18లో జరిగిన 75వ జాతీయ నమూనా సర్వే తెలిపింది. మానసిక అనారోగ్యం ఉందని అంగీకరిస్తే సమాజంలో వెలివేసినట్లు చూస్తారనే భయమే దీనికి కారణమని, ఈ భయాన్ని తొలగించడం మానసిక ఆరోగ్య సాధనలో తొలి మెట్టు అని ఐఐటీ జోధ్‌పూర్‌కు చెందిన డాక్టర్ అలోక్ రంజన్ చెప్పారు. అమెరికాలోని ఒహాయో విశ్వవిద్యాలయానికి చెందిన జుయెల్ కాస్ట్రోతో కలసి ఆయన చేసిన అధ్యయనం ఓ అంతర్జాతీయ సైన్స్ పత్రికలో ప్రచురితమైంది.భారత్‌లో మానసిక ఆరోగ్య సేవలను ప్రధానంగా ప్రైవేటు రంగమే అందిస్తున్నందున...భారతీయులు మానసిక చికిత్స కోసం సొంతంగా ఖర్చు చేసుకోవలసి వస్తోందని, ఈ బిల్లు సామాన్యులు భరించలేనంతగా ఉంటోందని రంజన్ తెలిపారు. మానసిక అస్వస్థుల్లో 66.1 శాతం మందికి అవుట్ పేషెంట్ సేవలు, 59.2 శాతం మందికి ఆస్పత్రుల్లో సేవలు అందిస్తున్నది ప్రైవేటు రంగమేనని వివరించారు. అల్పాదాయ వర్గాలతో పోలిస్తే అధికాదాయ వర్గాలు 1.73 రెట్లు ఎక్కువగా మానసిక అస్వస్థత గురించి వైద్యులకు తెలుపుతారని నమూనా సర్వే వెల్లడించింది.

బీజేపీలో కేరళ జనపక్షం విలీనం

న్యూదిల్లీ: కేరళ జనపక్షం (సెక్యులర్) పార్టీని భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో విలీనం చేశారు. జనపక్షం అధ్యక్షుడు పీసీ జార్జ్, ఆయన కుమారుడు షాన్ జార్జ్‌తో పాటు పార్టీ నేతలు బుధవారం కాషాయ కుండువాలు కప్పుకున్నారు. కేరళకు బీజేపీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్‌తో పాటు ఇతర సీనియర్లు కలిసి వారిని కాషాయ పార్టీలోకి ఆహ్వానించారు. కేరళ జనపక్షం (సెక్యూలర్)ను తమ పార్టీలో విలీనం చేసినట్లు బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోని ప్రకటించారు. వికసిత్ భారత్ లక్ష్యసాధన కోసమే కేరళ జనపక్షం విలీనం జరిగిందన్నారు. కాగా, పీసీ జార్జ్ గతంలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో కేరళ జనపక్షం (సెక్యులర్) పార్టీని స్థాపించారు. అంతకుముందు యూడీఎఫ్ ప్రభుత్వంలో చీఫ్ విప్‌గానూ పనిచేశారు.

కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వను

మమతా బెనర్జీ

కోల్‌కతా : కాంగ్రెస్ పార్టీపై మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. కానీ ఇప్పుడు ఒక సీట్లు కూడా ఇవ్వనని తెగేసి చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మాల్దాలో కాంగ్రెస్‌కు తమ పార్టీ రెండు సీట్లు ఇవ్వడానికి ప్రతిపాదించిందని, అయితే ఆ పార్టీ తమ డిమాండ్‌ను తిరస్కరించిందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లాలని టీఎంసీ నిర్ణయం తీసుకున్న కొద్ది రోజుల తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పోటీ చేసేందుకు మరిన్ని సీట్లు కావాలని అడిగిందని, ఆ డిమాండ్‌ను తాను తిరస్కరించానని, దీంతో సీట్ల పంపకాల చర్చలు కుప్పకూలాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో మాల్దాలో కాంగ్రెస్‌కు రెండు సీట్లు ఇవ్వాలని టీఎంసీ ప్రతిపాదించిందని మమతా బెనర్జీ నొక్కి చెప్పారు. 'వారు ఇప్పుడు సీపీఎంతో ఉన్నారు. బీజేపీతో ఉన్నారు. నేనెప్పటికీ క్షమించను. వారికి ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో కాంగ్రెస్‌తో మాల్దాలో రెండు ఎంపీ సీట్లు ఇస్తామని అసెంబ్లీలో చెప్పాం. మీరు గెలవడానికి మేము సహాయం చేస్తామని వారికి చెప్పాం. వారు మా డిమాండ్‌ను తిరస్కరించి, తమకు ఎక్కువ సీట్లు కావాలని అన్నారు. కానీ, సీపీఎంను వీడితే తప్ప ఒక్క సీటు కూడా ఇవ్వబోనని చెప్పాను' అని వివరించారు. రాష్ట్రంలో బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే సామర్థ్యం టీఎంసీకి ఉందని అన్నారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలపైనా మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రానికి రూ.7 వేల కోట్లు రావాల్సి ఉందన్నారు. ఆ మొత్తాన్ని ఫిబ్రవరి 1 నాటికి విడుదల చేయకుంటే ధర్నా చేస్తానని హెచ్చరించారు. ఉద్యమం ద్వారా వాటిని ఎలా సాధించాలో తనకు తెలుసునన్నారు. ఫిబ్రవరి 2న చేసే ధర్నాలో అందరూ పాల్గొనాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మమత పిలుపునిచ్చారు. అంతకుముందు, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ గత ఏడు నెలలుగా పదేపదే గుర్తు చేసినప్పటికీ సీట్ల పంపకాల ఒప్పందాన్ని ముగించడంలో కాంగ్రెస్ నిష్క్రియంగా ఉందన్నారు. పాట్నా, బెంగళూరులో జరిగిన 'ఇండియా' కూటమి సమావేశాల్లోనూ, దిల్లీలో జరిగిన చివరి సమావేశంలోనూ సీట్ల పంపకం అంశాన్ని లేవనెత్తారని టీఎంసీ నేత చెప్పారు. 'పొత్తు నిబంధనల ప్రకారం, మీరు చేసే మొదటి పని సీట్ల పంపకానికి సంబంధించినది. సీట్ల పంపకాల సమస్యకు ముద్ర వేయడానికి మేము గత ఏడాది జులై నుంచి ఏడు నెలల పాటు వేచి చూశాము. కానీ కాంగ్రెస్ ఖాళీగా కూర్చుంది. ఏమీ ముందుకు సాగలేదు' అని అభిషేక్ బెనర్జీ అన్నాట తెలిపారు. 'మేము కాంగ్రెస్ సీనియర్ నాయకత్వంతో అనేక సార్లు చర్చలు జరిపాం. దిల్లీలో జరిగిన 'ఇండియా' కూటమి చివరి సమావేశంలో డిసెంబరు 31 లోపు సీట్ల భాగస్వామ్య చర్చలు ఖరారు చేయాలని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అయితే, వారు అలా చేయలేదు. వారు చర్చల్లో పాల్గొనడం మానుకున్నారు' అని చెప్పారు.

ఈడీ అధికారులపై కేసు పెట్టిన సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బుధవారం రాంచీలోని ఎస్సీ/ఎస్టీ పోలీసు స్టేషన్‌లో ఈడీ సీనియర్లపై కేసు నమోదు చేశారు. సోరెన్‌కు చెందిన దిల్లీ ఇంటిని ఇటీవల తనిఖీ చేసిన వ్యవహారంలో పోలీసులకు సోరెన్ ఫిర్యాదు చేసినట్లు ఓ అధికారి బుధవారం తెలిపారు. 'ఈడీ సీనియర్ అధికారులు కొందరిపై ఎఫ్ఐఆర్ దాఖలైంది. సీఎం నుంచి మాకు ఫిర్యాదు అందింది' అని రాంచీ ఎస్ఎస్పీ చందన్ కుమార్ సిన్హా వెల్లడించారు. ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన వివరాలను ఆయన తెలుపలేదు. ఎస్సీ, ఎస్టీ దురాగతాల చట్టం కింద చర్యలు తీసుకోవాలని సీఎం తన ఫిర్యాదులో కోరినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. సోమవారం ఆయన దిల్లీ నివాసాన్నీ ఈడీ బృందం తనిఖీ చేసింది. దాదాపు 13 గంటలు అక్కడే గడిపింది. రూ.36లక్షల నగుదు, ఎస్‌యూవీతో పాటు కొన్ని పత్రాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. కాగా, భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు రాంచీలోని సోరెన్ నివాసానికి చేరుకొని ఆయనను కొన్ని గంటల పాటు విచారించారు. సోరెన్ అరెస్టు కావచ్చు అన్న ఊహాగానాలు ఉన్నాయి.

మా కాలనీ నుండి వెళ్లిపోండి

సీనియర్ కాంగ్రెస్ నేతకు నోటీసులు



న్యూదిల్లీ: అయోధ్య రామమందిర వేడుకను వ్యతిరేకిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకుగాను నివాసాన్ని ఖాళీ చేయాల్సిందిగా కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్‌కు నోటీసులు అందాయి. దిల్లీలోని జంగ్‌పురాలోని నివాసాన్ని ఖాళీ చేయాల్సిందిగా మణిశంకర్, ఆయన కుమార్తె సూర్య అయ్యర్‌లకు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఏ) నోటీసులు పంపింది. గతంలో జరిగిన ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇతర నివాసితుల మతపరమైన మనోభావాలు దెబ్బతీసేలా, శాంతికి భంగం కలిగించేలా పోస్టులు చేయవద్దని ఆ నోటీసుల్లో కోరింది. 'మీ పోస్టు సరైనదని మీరు భావిస్తే... అటువంటి విద్వేషాన్ని ఆమోదిస్తూ కళ్లు మూసుకునే మరో కాలనీకి దయచేసి వెళ్లిపోవాలని మేము సూచిస్తున్నాము' అని పేర్కొంది. విద్యావంతురాలైన సూర్య అయ్యర్‌కి ఇది తగదని, 500 ఏళ్ల తర్వాత రామమందిరాన్ని నిర్మిస్తున్నారని, అది కూడా సుప్రీంకోర్టు 5-0 మెజారిటీతో తీర్పు ఇచ్చిన తర్వాతేనన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యుఏ పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పుని గౌరవించాలని, రాజ్యాంగం కల్పించిన వాక్‌స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం తగదని సూచించింది. 'మీరు దేశ శ్రేయస్సు కోసం రాజకీయాల్లో ఏమైనా చేయవచ్చు. కానీ మీ చర్యలు కాలనీకి మంచి లేదా చెడ్డపేరు తీసుకువస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇకపై ఇటువంటి పోస్టులు / కామెంట్లు చేయడం మానుకోవాలి' అని స్పష్టంచేసింది. మణిశంకర్ అయ్యర్ తన కుమార్తె పోస్టును ఖండించాలని లేదా ఇల్లు వదిలి వెళ్లాలని ఆ నోటీసుల్లో ఆదేశించారు. ప్రజలను రెచ్చగొట్టి వారి మధ్య ద్వేషాన్ని, అపనమ్మకాన్ని సృష్టించవద్దని అసోసియేషన్ హెచ్చరించింది. రామమందిర ప్రాణ ప్రతిష్ఠ వేడుకకు నిరసనగా తాను నిరాహార దీక్ష చేస్తున్నట్లు జనవరి 20న ఫేస్‌బుక్ పోస్ట్‌లో సూర్య అయ్యర్ పేర్కొన్నారు. ఈ దీక్ష తోటి ముస్లింలకు ప్రేమ, బాధను వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు.

మమ్మల్ని వేధిస్తున్నారు

పార్లమెంటుపై దాడి కేసు నిందితుల మొర-కోర్టుకు ఫిర్యాదు

న్యూదిల్లీ: ఓ రాజకీయ పార్టీతో సంబంధాలు ఉన్నట్లు అంగీకరించాలని తమను కస్టడీలో తీవ్రంగా వేధిస్తున్నట్లు పార్లమెంటుపై దాడి కేసు నిందితుల్లో ఐదుగురు మొర పెట్టుకున్నారు. నార్కో/పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించిన వారు తమను తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురిచేశారని వాపోయారు. నేరాన్ని అంగీకరించాలని, వారు చెప్పిన రాజకీయ పార్టీతో సంబంధాలను ఒప్పుకోవాలని కరెంటు షాక్‌లు ఇస్తూ బెదిరిస్తున్నారని పాటియాలా హౌస్ కోర్టుకు ఫిర్యాదు చేశారు. 70 ఖాళీ పత్రాలపై తమ సంతకాలు తీసుకున్నారని కూడా కోర్టుకు ఇచ్చిన ఫిర్యాదులో మనోరంజన్, సాగర్ శర్మ, లలిత్ ఝా, అమోల్ షిండె, ముకేశ్ కుమావత్ పేర్కొన్నారు. కేసులో నిందితురాలి నీలమ్ ఆజాద్ పాలీగ్రాఫ్ పరీక్షకు నిరాకరించారు. అయితే ఆరుగురి జుడీషియల్ కస్టడీని మార్చి ఒకటో తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి హరదీప్ కౌర్ ఆదేశాలిచ్చారు. నిందితుల ఫిర్యాదుపై పోలీసుల నుంచి వివరణను కోరారు. ఈ వ్యవహారంలో ఫిబ్రవరి 17న విచారణ జరుగుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

చండీగఢ్ మేయర్ ఎన్నికపై హైకోర్టు కీలక ఉత్తర్వులు

చండీగఢ్: చండీగఢ్ మేయర్ ఎన్నికకు సంబంధించి రిటైర్డ్ హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో తాజా ఎన్నికలు జరిపించాలని కోరుతూ ఆప్ దాఖలు చేసిన పిటిషన్‌పై పంజాబ్, హరియాణా హైకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మూడు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాల్సిందిగా చండీగఢ్ పరిపాలన, మునిసిపల్ కార్పొరేషన్‌కు నోటీసులిచ్చింది. చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని 35 మంది సభ్యుల సభలో కాంగ్రెస్, ఆప్ విజయం సాధిస్తుందని అంచనా వేసిన సంగతి తెలిసిందే. అయితే జనవరి 30న జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కూటమి కొన్ని స్థానాలకు పరిమితం కాగా, వక్రమార్గంలో బీజేపీ విజయం సాధించింది. ఈ ఎన్నిక చెల్లదని, తాజా ఎన్నికలు కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తామని ఆప్ పేర్కొంది. మేయర్ అభ్యర్థి, ఆప్ కౌన్సిలర్ కులదీప్ కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తి మోసం, ఫోర్జరీ అని, ఈ ఎన్నిక ప్రక్రియను రద్దు చేయాలని కులదీప్ కుమార్ కోర్టును కోరారు. కొత్తగా ఎన్నికైన మేయర్ విధులు నిర్వర్తించకుండా చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ నిరోధించేలా సూచనలివ్వాలని పిటిషన్‌లో కోరారు. ప్రిసైడింగ్ అధికారి అనిల్ మసీహ్ బ్యాలెట్ పత్రాలు ట్యాంపరింగ్ చేశారని ప్రతిపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు.

దోపిడీకి వనరు మద్యం

- జగన్‌పై కేసులు పెట్టాలి: రామకృష్ణ
- మద్య నిషేధం చేసే వరకు పోరాటం: మహిళా సమాఖ్య
- విజయవాడలో 'మద్యంపై యుద్ధం'

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మద్యాన్ని దోపిడీకి వనరుగా మార్చిందని వక్తలు విమర్శించారు. అక్రమ మద్యం వ్యాపారం, కల్తీ మద్యం కారణంగా పేదలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ 'మద్యంపై యుద్ధం' పేరుతో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్వర్యంలో మహాధర్నా జరిగింది. స్థానిక లెనిన్ సెంటర్‌లో జరిగిన ఈ ధర్నా సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో దశల వారీగా మద్యాన్ని నిషేధించి 2024లో ఓట్లు అడుగుతానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అయితే ఐదేళ్లు పూర్తికావస్తున్నా మద్యం ఏరులైపారుతుందన్నారు. సీఎం జగన్, ఆయన బంధువులు బెవరేజేస్ కార్పొరేషన్ ద్వారా ప్రెసిడెంట్ మెడల్, బూమ్ బూమ్, స్పెషల్ స్టేటస్ వంటి రకరకాల పేర్లతో సొంత బ్రాండ్‌లు తయారు చేసి అమ్ముతున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం ద్వారా వచ్చే ఆదాయం 25 శాతం పెరిగిందన్నారు. ఈ వేల కోట్ల రూపాయల ఆదాయం జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతుందన్నారు. ఆ డబ్బును రానున్న ఎన్నికల్లో ఖర్చు పెట్టి తిరిగి అధికారంలోకి రావాలనే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. మద్య నిషేధం చేయలేదని, కనీసం నియంత్రణ కూడా చేయలేదన్నారు. జగన్ అవినీతిని, ఉత్తుత్తి వాగ్దానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అక్రమ మద్యం వ్యాపారం జరుగుతుందని, సీఎంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి... కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో వంద కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను ఆరు నెలలకు పైగా జైలులో పెట్టారని తెలిపారు. ఏపీలో వేల కోట్ల రూపాయల అవినీతి చేసిన జగన్‌పై కేసులు పెట్టలేదన్నారు. బీజేపీకి జగన్ తొత్తుగా మారారని విమర్శించారు. అక్రమం మద్యం వ్యాపారం, కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న సీఎం జగన్‌పై కేసులు పెట్టి జైలుకు పంపించాలన్నారు.

సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మద్యం సేవించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయని చెప్పారు. నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. ఈ సభకు ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ మద్యం కారణంగా 70 శాతం కుటుంబాలు అనేక అనర్థాలకు గురవుతున్నాయని, అకాల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మద్య నిషేధం చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ అబ్కారీ శాఖను 25 సంవత్సరాలకు తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మద్యాన్ని నిషేధించే వరకు మహిళా సమాఖ్య పోరాడుతుందన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ ధర్నా కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. మద్యంపై మహిళా సమాఖ్య పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పంచదార్ల దుర్గాంబ, కార్యదర్శులు ఎం.యామిని, బి.పావని, పి.శ్రావణి, డాక్టర్ సుజాత, పిడికిటి సంధ్యాకుమారి, ఆఫీస్ బేరర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులతో పాటు నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కల్తీ మద్యంపై వినూత్న నిరసన

చేతికొచ్చిన కుమారుడు కల్తీ మద్యం సేవించి ప్రాణాలు కోల్పోవటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆవేదన ఎలా ఉంటుంది. ప్రతిపక్ష నాయకులు వారిని పరామర్శించి ఇలాంటి మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేయటం వంటి యథార్థ సంఘటనలకు అద్దం పట్టేలా వివరిస్తూ యువజన, మహిళ సమాఖ్య శ్రేణులు వినూత్నంగా నిరసన తెలిపారు. మద్యం సీసాలు పగులగొట్టి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఏక్ భారత్- శ్రేష్ఠ్ భారత్' లక్ష్యం

- యువశక్తి, నారీశక్తి, రైతులు, పేదలు
- ఈ నాలుగు దేశాభివృద్ధికి నాలుగు స్తంభాలు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: యువశక్తి, నారీశక్తి, రైతులు, పేదలు అనే నాలుగు స్తంభాలపై దేశాభివృద్ధి ఆధారపడి ఉందని విశ్వసిస్తున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. గత సవాళ్లను అధిగమించడం ద్వారానే ఏదేని దేశం పురోగతి సాధించగలదని తెలిపారు. ఉజ్వల భవిష్యత్ నిర్మాణానికి శాయశక్తుల ప్రయత్నించాల్సిందేనని ముర్ము నొక్కిచెప్పారు. ఏక్ భారత్- శ్రేష్ఠ్ భారత్' నినాదంతో ముందుకెళుతున్నామని తెలిపారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా ముర్ము కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. 'గరీబీ హఠావో' నినాదాన్ని చాలా దశాబ్దాలుగా వింటున్నామని, పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా దేశం ముందుకెళ్తోందని, గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. భారత్‌కు 2023 సంవత్సరం చరిత్రాత్మకమైనదన్నారు. ఈ ఏడాదిలోనే మన దేశం అత్యంత వేగంగా అభివృద్ధి సాధించే ఆర్థిక వ్యవస్థగా మారిందని, వరుసగా రెండు త్రైమాసికాల్లో 7.5శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. చౌరబాట్ల నుంచి ద్రవ్యోల్బణం వరకు అన్ని అంశాలను ప్రస్తావించారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసిన సంస్కరణలను కొనియాడారు. తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటు కానుందని చెబుతూ ఆదివాసీ యోధులను స్మరించుకోవడం గర్వకారణమని రాష్ట్రపతి అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చామని, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేలా 'నారీశక్తి వందన్ అధినియమ్' బిల్లును ఆమోదించుకున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, రెండు కోట్ల మంది మహిళలు స్వయం సమృద్ధి సాధించారని అన్నారు. ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో గౌరవం కల్పించామన్నారు. ఎన్నో ఏళ్ల కల అయిన అయోధ్య రామాలయం సాకారమైందని, అధికరణ 370 రద్దుపై అనుమానాలు గతమాటలని ముర్ము అన్నారు. గతేడాది చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని, ఆదిత్య ఎల్-1 మిషన్ విజయవంతంగా చేపట్టిందని, జీ20 సమావేశాలను ఘనంగా నిర్వహించిందని ప్రశంసించారు. ప్రపంచ వారసత్వ సంపదగా శాంతినికేతన్ గుర్తింపు సాధించిందన్నారు. భగవాన్ బిర్సా ముండా జన్మదినాన్ని జన్ జాతీయ దివస్‌గా జరుపుకొంటున్నామని తెలిపారు. 'రక్షణ, అంతరిక్ష రంగంలో దూసుకెళుతున్నాం. ఉత్తరప్రదేశ్, తమిళనాడులో రక్షణ కారిడార్లు ఏర్పాటు చేసుకున్నాం. రక్షణ రంగ ఉత్పత్తులను దేశీయంగా తయారు చేసుకోవడం గర్వకారణం' అని రాష్ట్రపతి అన్నారు. ఉగ్రవాదినికి వ్యతిరేకంగా భారత్ గళానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఉన్నదని చెప్పారు. దేశంలో 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాంకింగ్ వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఉందన్నారు. ఆత్మనిర్భరత, మేకిన్ ఇండియా మన బలాలుగా మారాయని ముర్ము తెలిపారు. సరిహద్దుల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఉగ్రవాదం, విస్తరణవాదానికి మన దళాలు గట్టిగా బదులిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతత నెలకొన్నదని అన్నారు. గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహిస్తున్నామని,. సౌర విద్యుదుత్పత్తిలో ప్రపంచంలోనే ఐదో స్థానంలో ఉనర్నామని చెప్పారు. దేశంలో లక్షకు పైగా స్టార్టప్‌లు ఉన్నట్లు ముర్ము తెలిపారు. ఆసియా క్రీడల్లో తొలిసారి 107, పారా క్రీడల్లో 111 పతకాలను భారత్ సాధించిందని తెలిపారు. నమోభారత్ రైలు ఆవిష్కరణను ప్రస్తావించారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి.. లాభాలను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని ముర్ము అన్నారు. కిసాన్ సమ్మాన్ ద్వారా 10 కోట్ల మంది రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని చెప్పారు. ఉజ్వల కనెక్షన్లు పది కోట్లు దాటాయని, రూ.7లక్షల ఆదాయం వరకు పన్ను లేదని, సామాన్యులపై భారం లేకుండా పన్ను సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఆవాస్ యోజన ద్వారా 4.10కోట్ల మందికి పక్కా ఇళ్లు నిర్మించామని, పదేళ్లలో ఆదివాసీల వేలాది గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని ముర్ము అన్నారు. అండమాన్, లక్షద్వీప్ వంటి ప్రాంతాలపై పర్యాటకులకు ఆసక్తి పెరిగిందన్నారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ తర్వాత 13లక్షల మంది బాలక్‌రామ్‌ను దర్శించుకున్నారని రాష్ట్రపతి తెలిపారు.

డీజీపీ వీఆర్‌ఎస్ తీసుకోవాలి

టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో పాలనా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమై... ఊరూరా జగన్ గూండారాజ్ మాత్రమే నడుస్తోందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఒకప్పుడు దేశం కీర్తించిన రాష్ట్ర పోలీసు శాఖ కళ్ల ముందే పతనం అవుతుంటే కట్టడి చేయలేని డీజీపీ తక్షణమే వాలంటరీ రిటైర్మెంట్ (వీఆర్‌ఎస్) తీసుకోవాలన్నారు. కింది స్థాయి అధికారులు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన జిల్లా ఎస్పీలు అరాచకాలకు కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. చట్టాన్ని అమలు చేయలేని ఆయా జిల్లాల ఎస్పీలు ఖాకీ యూనిఫాం తీసేసి వైసీపీ జెండానే యూనిఫాంగా కుట్టించుకోవాలన్నారు. తప్పు చేసిన అధికారులను న్యాయస్థానాలు తప్పక శిక్షిస్తాయని చంద్రబాబు హెచ్చరించారు. మార్టూరులో మారణా యుధాలతో మైనింగ్ తనిఖీలు, క్రోసూరులో రౌడీ మూకల విధ్వంసానికి పోలీసుల సహకారం పూర్తిగా గాడి తప్పిన పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. క్రోసూరులో ఎమ్మెల్యే కుమారుడు వందల మందితో ప్రజల ఆస్తులపై దాడికి దిగితే చర్యలు తీసుకోకపోగా పోలీసులు సహకరించారని, రాష్ట్ర పోలీసు శాఖ గౌరవాన్ని దిగజార్చిన ఇలాంటి ఘటనలపై స్పందించని డీజీపీ ఎందుకని ప్రశ్నించారు. అధికారులు చట్టానికి కట్టుబడి పనిచేయాలని చంద్రబాబు హితవు పలికారు.

21 మంది అదనపు ఎస్పీల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 21 మంది అదనపు ఎస్పీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను బుధవారం జారీజేసింది. టీపీ విఠలేశ్వర్‌ను ఏసీబీ అడిషనల్ ఎస్పీగా, జే.తిప్పేస్వామిని అదనపు ఎస్పీ (ఏపీపీఏ)గా, ఎల్.సుధాకర్‌ను కడప అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేసింది. ఎస్.వెంకటరావును విశాఖపట్నం ఎస్‌బీ అదనపు డీసీపీగా, డాక్టర్ ప్రేమ్ కాజల్‌ను శ్రీకాకుళం అదనపు ఎస్పీ(అడ్మిన్)గా, పి.అనిల్‌కుమార్‌ను రాజమండ్రి అదనపు ఎస్పీగా, జి.వెంకటేశ్వరరావును అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కృష్ణా, జి.స్వరూపరాణిని ఏలూరు అడిషన్ ఎస్పీ(అడ్మిన్), ఎంవీవీ భాస్కరరావును అడిషన్ ఎస్పీ(అడ్మిన్) కాకినాడ, ఎవి సుబ్బరాజును చిత్తూరు అడిషనల్ ఎస్పీగాను, జీవీ రమణమూర్తిని గుంటూరు అడిషనల్ ఎస్పీ(అడ్మిన్), సిహెచ్.లక్ష్మీపతిని పల్నాడు అడిషనల్ ఎస్పీ(క్రైమ్)గాను నియమించారు. ఆర్.శ్రీహరిబాబును విజయవాడ అడిషనల్ డీసీపీగా, కె.సుప్రజ అడిషనల్ ఎస్పీ (ఏసీబీ) బదిలీ అయ్యారు. కె.శ్రీలక్ష్మిని కాకినాడ అదనపు ఎస్పీగా, కె.ప్రవీణ్‌కుమార్‌ను నంద్యాల అడిషనల్(అడ్మిన్) ఎస్పీగా, జి.వెంకట్రాముడును కడప అదనపు ఎస్పీగా, టి.కనకరాజును విజయవాడ అదనపు డీసీపీగా, బి.ఉమామహేశ్వరరావును అదనపు(క్రైమ్) శ్రీకాకుళం, ఇ.నాగేంద్రుడును అదనపు ఎస్పీ ఏసీబీగా నియమించారు. మరో అధికారి ఎస్‌కే చంద్రశేఖర్ పదవీ విరమణ చేశారు. మరో ఆరుగురు ఎస్పీ కేడర్ అధికారులు యు.రామమోహన్, కేవీ ప్రేమ్‌జీత్, ఎస్ఎల్ఎన్ రెడ్డి, ఎ.మనుమంతరావు, కె.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావును వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.

సభను అడ్డుకుంటే ప్రజలు గుర్తించరు

విపక్షాలపై మోదీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: ఈసారి ఆర్థికమంత్రి 'దిశా నిర్దేశక్' బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ బుధవారం మీడియాతో మాట్లాడారు. దేశం దినదినాభివృద్ధి చెందుతూ కొత్త శిఖరాలు అధిరోహిస్తుందని తాను దృఢంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రయాణం కొనసాగుతోందని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని ధీమా వ్యక్తం చేశారు. అదేసమయంలో ప్రతిపక్షాలపై ప్రధాని ఎదురుదాడి చేశారు. పార్లమెంట్ కార్యకలాపాలను తరచూ అడ్డుకునే ఎంపీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, అనైతికంగా వ్యవహరించిన వారు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని, ఇలా అంతరాయం కలిగించేవారిని ఎవరూ గుర్తుపెట్టుకోరని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలను అడ్డుకునే వారిని ప్రజలు క్షమించరని విమర్శలు గుప్పించారు. నారీశక్తిని ప్రధాని ప్రస్తావించారు. శాంతి పరిరక్షణలో మహిళలు కీలకంగా మారుతున్నారని తెలిపారు.

భారత్ బాగుకోసం మరో లెనిన్ అవసరం

సామ్రాజ్యవాదాన్ని అంతమొందించాలి: వేణుగోపాల్

విశాలాంధ్ర-తిరుపతి: భారతదేశం బాగుకోసం మరో లెనిన్ రావాలని... పీడిత వర్గాలను దోపిడీ చేస్తున్న సామ్రాజ్యవాదాన్ని అంతమొందించాలని వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. రష్యా విప్లవ పితామహులు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతిని తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ వేదిక, అఖిల భారత విద్యార్థి సమాఖ్య సంయుక్త అధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో బుధవారం సదస్సు నిర్వహించారు. అభ్యుదయ వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.డి. ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ 'సామ్రాజ్యవాదం-లెనినిజం' అనే అంశంపై ఉపన్యసించారు. లెనిన్‌గా సుప్రసిద్ధుడైన వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యనోవ్ భౌతికంగా మరణించి ఇప్పటికి వందేళ్లు నిండాయన్నారు. 54 ఏళ్లకే మరణించినా... అందులో 35 ఏళ్లకు మించి ఆయన పీడిత వర్గ విముక్తి కోసం పని చేశారన్నారు. ఒక మనిషిని మరొక మనిషి... ఒక జాతిని మరొక జాతి పీడించడానికి వీలులేని ఒక సమతా సుందర స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత లెనిన్‌దే అన్నారు. లెనిన్ జీవితమంతా వ్యక్తిగత స్థాయిలోనూ... నిర్వహించిన ఉద్యమాల స్థాయిలోనూ... మొత్తంగా ఎదుర్కొన్న వ్యవస్థ స్థాయిలోనూ... కష్టం మీద కష్టం తోసుకొచ్చాయన్నారు. ఆ కష్టభరిత జీవితంలోనే లెనిన్ విజయ సాఫల్యం వైపు పురోగమించాడన్నారు. ఆయన చేసిన అధ్యయనం, రచనలు, ఉపన్యాసం, ఎదుటివారిని మెప్పించే వాదన పటిమ... నాయకత్వం వహించిన ఉద్యమాలు, అనుభవించిన నిర్బంధాలూ, తప్పించుకున్న హత్యా ప్రయత్నాలూ, స్థాపించిన మొట్టమొదటి కార్మిక కర్షక రాజ్యం... నిర్వహించిన కార్మికవర్గ సోషలిస్టు సమాజ నిర్మాణం, వ్యూహాలు మార్చిన చాతుర్యం, ప్రపంచమంతటికీ, సర్వకాలాలకూ ప్రాసంగికమైన ఆలోచన, ఆచరణలు... లెనిన్ జీవితం ఒక ప్రయోగమని వేణుగోపాల్ చెప్పారు. లెనిన్ ప్రపంచ చరిత్రనే మార్చే కొత్త దారి ఏర్పరిచాడన్నారు. 'ప్రపంచ మనే కావ్యానికి ప్రతి పదార్థం లెనిన్. బ్రతుకనే చిక్కు సమస్యకు పరిష్కారం లెనిన్' అని శ్రీశ్రీ రాసిన కవితాపాదాలు అక్షర సత్యాలన్నారు. లెనిన్ యుద్ధ కమ్యూనిజం, నూతన ఆర్థిక విధానాలు, స్వచ్ఛంద సేవ వంటి కొత్త కార్యక్రమాలు ప్రతిపాదించాడన్నారు. సామ్రాజ్యవాదం నేడు విదేశీ పెట్టుబడుల రూపంలో మారుమూల ఉన్న కంపెనీలను కూడా శాసిస్తోందన్నారు. మన జీవితాలను కబళించే శక్తిగా తయారయ్యిందన్నారు. సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడానికి యువత, విద్యార్థులు నడుం బిగించాలని, ఇది ప్రజల ముందు ఉన్న కర్తవ్యమని వేణుగోపాల్ చెప్పారు.

విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ నేడు యువతను అసాంఘిక శక్తులుగా మార్చి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే పరిస్థితిని చూస్తున్నామన్నారు. రాయలసీమ ఫ్యాక్షన్‌లో ఏ రెడ్డి కానీ... నాయుడు కానీ లేదా అగ్రవర్ణాలు ఎవరూ ఒక్కరు చనిపోలేదన్నారు. ఫ్యాక్షన్ పేరుతో బతుకులు నాశనం చేసుకుంటోంది పీడిత వర్గాలేనని ఆయన చెప్పారు. నేడు ప్రభుత్వాలు సమ్మె హక్కును పూర్తిగా కాలరాశాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని కోసం రైతులు చేస్తున్న పోరాటం ఆదర్శమన్నారు. 32 మంది ఆత్మబలిదానంతో విశాఖ ఉక్కు సాధిస్తే దానిని ప్రైవేటీకరణ చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. ఈ పోరాటానికి అందరూ మద్దతుగా నిలవాలని హరినాథరెడ్డి కోరారు. ఈ సమావేశంలో అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటరమణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, తిరుపతి జిల్లా కార్యదర్శి ప్రవీణ్, తిరుపతి నగర ప్రముఖులు, విద్యార్థులు, యువజనులు పాల్గొన్నారు.

హిందువుల పూజకు అనుమతి

జ్ఞానవాపి కేసుపై వారణాసి కోర్టు తీర్పు



వారణాసి: జ్ఞానవాపి కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలో గతంలో మూసివేసిన నేలమాళిగ ప్రాంతం 'వ్యాస్ కా టెకానా'లో హిందూ దేవతల ప్రతిమలకు పూజలు చేసుకునేందుకు హిందువులను అనుమతిస్తూ నగర కోర్టు ఒకటి బుధవారం తీర్పు ఇచ్చింది. వారం రోజుల్లోగా అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. కాశీ విశ్వనాథ ఆలయం పూజారులే అక్కడ పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. బారికేడ్ల తొలగింపు సహా ఏర్పాట్లు వారంలో పూర్తి చేయాలని న్యాయమూర్తి తెలిపారు. కాశీ విశ్వనాథ ఆలయంలోని పూజారులే ప్రార్థనలు నిర్వహించాలని కోర్టు పేర్కొంది. 'హిందూ వైపు పూజలు చేయడానికి అనుమతి ఉంది. జిల్లా యంత్రాంగం ఏడు రోజుల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికి అక్కడ ప్రార్థనలు చేసే హక్కు ఉంటుంది' అని ఈ కేసులో నలుగురు హిందూ మహిళా పిటిషనర్ల తరపు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ అన్నారు. కాగా మసీదు కమిటీ వారణాసి నగర కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాలు చేయవచ్చని భావిస్తున్నారు. మసీదుకు చెందిన నేలమాళిగలో నాలుగు 'టెఖానా లేదా సెల్లార్‌లో ఒకటి ఇప్పటికే అక్కడ నివసిస్తున్న పూజారుల కుటుంబం అధీనంలో ఉంది. వంశపారంపర్య పూజారులుగా ఉన్న తమను ఆ సముదాయంలోకి అనుమతించి పూజలు నిర్వహించేందుకు అనుమతించాలని ఆ కుటుంబ వాదిస్తోంది. ఈ ప్రాంతంలో సర్వే సందర్భంగా హిందూ దేవుళ్ల విగ్రహాల శిథిలాలు దొరికాయని గతంలో పేర్కొన్నారు. ఇది మసీదు నిర్మాణంలో స్తంభాలతో సహా ముందుగా ఉన్న నిర్మాణంలోని భాగాలు ఆలయంగా ఉన్నట్లు కూడా ఏఎస్ఐ నివేదిక వెల్లడించింది. మసీదు సముదాయంలోని మూసివున్న వజుఖానా' ప్రాంతంలో కనుగొనబడిన 'శివలింగం' తవ్వకాలు, శాస్త్రీయంగా సర్వే చేయవలసిందిగా నలుగురు హిందూ మహిళలు సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఒక రోజు తర్వాత బుధవారం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ప్రాంతాన్ని 2022లో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి సీలు చేశారు. అయితే హిందూ పక్షం ఇప్పుడు ఏఎస్ఐ లేదా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాని 'వజుఖానా' ప్రాంతంలో 'శివలింగం' కు హాని కలగకుండా మరో సర్వే నిర్వహించాలని కోర్టును కోరింది. ఆ స్థలంలో ఆలయాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సివిల్ వ్యాజ్యాలను సవాలు చేసిన మసీదు కమిటీ అన్ని పిటిషన్లను తిరస్కరించింది. మొత్తం కేసు ప్రసిద్ధ కాశీ విశ్వనాథ్ ఆలయానికి పక్కనే ఉన్న జ్ఞానవాపి మసీదుకు సంబంధించినది. వారణాసి కోర్టులో 1991లో ఈ కేసును కొనసాగించడాన్ని సవాలు చేస్తూ ఉత్తర ప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు దాఖలు చేసిన రెండు పిటిషన్లతో సహా హైకోర్టు విచారణ చేసి తిరస్కరించింది. 1991లో వివాదాస్పద ప్రాంగణాన్ని నియంత్రించాలని కోరుతూ ఆది విశ్వేశ్వర్ విరాజ్‌మన్ దేవత తరపున దావా వేశారు. అయితే దీనిని సవాలు చేస్తూ అంజుమాన్ ఇంతేజామియా మసాజిద్ కమిటీ, వక్ఫ్ బోర్డు స్వాతంత్ర్య దినోత్సవం నాడు, అంటే ఆగస్టు 15, 1947న ఉన్న మతపరమైన స్థలాల స్వభావాన్ని మార్చడాన్ని నియంత్రించే చట్టం ప్రకారం దావాను కొనసాగించలేమని వాదించారు. ఈ వివాదం స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్నందున దాని ప్రభావం ఉండదని పిటిషనర్లు వాదించారు. ఇదిలాఉండగా, వారం రోజుల్లో పూజలు ప్రారంభిస్తామని కాశీ విశ్వనాథ్ ట్రస్ట్ ప్రకటించింది. ఇది హిందువుల అతి పెద్ద విజయంగా వ్యాఖ్యానించింది.

2, 3, 4 తేదీల్లో సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఫిబ్రవరి 2,3,4 తేదీలలో హైదరాబాదులో జరగనున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంలోని నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా వద్ద తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ వీటిని ఏర్పాటు చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ ఫిబ్రవరి 2 నుండి 4వ తేదీ వరకు జరిగే సీపీఐ జాతీయ సమావేశాలలో దేశ పరిస్థితులపై చర్చలు జరుగుతాయని చెప్పారు. ఎన్నికల వేళ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తారన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, స్టాలిన్, హైదరాబాద్ జిల్లా నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, చెట్టుకింద శ్రీనివాస్, కాంపల్లి కల్యాణ్ కుమార్ అఖిల్, అనిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర జీవిత చందాదారుడిగా దేవేంద్రరెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి: పిల్లపాలెం దేవేంద్రరెడ్డి విశాలాంధ్ర జీవిత చందాదారుడిగా చేరారు. చందా మొత్తాన్ని బుధవారం ఉదయం తిరుపతిలో విశాలాంధ్ర జనరల్ మేనేజర్ హరినాథరెడ్డికి అందజేశారు. దేవేంద్రరెడ్డికి విశాలాంధ్ర బ్యూరో ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రసాద్, మేనేజర్ సుబ్బరాయుడు అభినందనలు తెలియజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.